# బర్డ్‌ఫ్లూ భయం భయం

పరిధిలో మాత్రమే రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆ ప్రాంతాల్లో గుడ్లు తినొద్దని సూచించారు. ఈ వైరస్ 3234 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత వద్ద జీవించదని నిపుణులు చెబుతున్నారు. ఎపిలో ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ వైరస్ వ్యాప్తికి భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు. చికెన్‌ను 20 నిమిషాల పాటు ఉడికిస్తుంటాం అంటే దాదాపు 100 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వండుతారు. ఈ ఉష్ణోగ్రతలో వైరస్ బతికే అవకాశం లేదని చెబుతున్నారు. పూర్తిగా ఉడికించిన చికెన్, గుడ్లతో సమస్య ఉండదని చెప్పారు.బర్డ్ ఫ్లూ సోకి చనిపోయి కోళ్లను తిన్నా బర్డ్ ఫ్లూ సోకినట్లుగా తెలియకపోయినా ఆ చికెన్ తిన్నా మనుషులకు కూడా ఆ ఫ్లూ సోకే అవకాశం ఉందన్న రిపోర్టులు ఉన్నాయని చెబుతున్నారు.తెలుగు రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా పెద్ద సంఖ్యలో కోళ్ల మరణాలు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఏపీలోని గోదావరి జిల్లాల్లో కోళ్ల మరణాలకు బర్డ్ ఫ్లూ కారణమని నిర్ధారణ కూడా అయింది.

ఈ క్రమంలోనే కొద్ది రోజులు చికెన్ తినొద్దు అంటూ తెలంగాణ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినట్టుగా ఓ వార్త తెగ వైరల్ అవుతుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం నిజంగానే కొద్ది రోజులు చికెన్ తినొద్దు అని ఉత్తర్వులు జారీ చేసిందా? అనే అనుమానం పలువురిలో కలుగుతుంది.తెలుగు రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా పెద్ద సంఖ్యలో కోళ్ల మరణాలు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఏపీలోని గోదావరి జిల్లాల్లో కోళ్ల మరణాలకు బర్డ్ ఫ్లూ కారణమని నిర్ధారణ కూడా అయింది. ఈ క్రమంలోనే పౌల్ట్రీ ఉత్పత్తులంటే జనాలు భయపడిపోతున్నారు. మరోవైపు చికెన్, గుడ్లు తినకూడదని నిర్ణయించుకుంటున్నారు. అయితే ఈ క్రమంలోనే కొద్ది రోజులు చికెన్ తినొద్దు అంటూ తెలంగాణ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినట్టుగా ఓ వార్త తెగ వైరల్ అవుతుంది. ఈ వార్తతో ఓ సర్క్యులర్ కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం నిజంగానే కొద్ది రోజులు చికెన్ తినొద్దు అని ఉత్తర్వులు జారీ చేసిందా? అనే అనుమానం పలువురిలో కలుగుతుంది. అయితే ఇందుకు సంబంధించి వాస్తవం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..“కొన్ని రోజులు చికెన్ తినొద్దు.. ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం హెచ్చరిక. కోళ్లకు సోకుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన.

ఇప్పటికే ఈ వ్యాధి తెలంగాణ, ఏపీలకు వ్యాపించినట్లు సమాచారం” అని పలువురు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్.. పశుసంవర్ధక శాఖ తరఫున జారీ చేసినట్టుగా ఉన్న మెమోను కూడా షేర్ చేస్తున్నారు.లఅయితే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్టుగా చికెన్ తినొద్దని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి హెచ్చరిక జారీ చేయలేదు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న మెమో ఈ నెల 8వ తేదీన జారీ చేయబడింది. అందులో ఎక్కడా కూడా “చికెన్ తినొద్దు..” అని ప్రస్తావించలేదు. ఇక, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారంపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ స్పందించారు. చికెన్, గుడ్ల తినడంపై ఎలాంటి నిషేధం లేదని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా బర్డ్ ఫ్లూలో ఒక రకం) నివేదికల కారణంగా కేవలం ముందు జాగ్రత్త చర్యగా ఈ మెమో జారీ చేయబడిందనిపేర్కొన్నారు. “ప్రజలు కోడి, గుడ్లు తినవచ్చు.. ఇతర రాష్ట్రాల్లో నివేదించబడుతున్నందున ఈ మెమో ముందు జాగ్రత్త చర్య” అని సబ్యసాచి ఘోష్ చెప్పారు.%తీవఫశీఎవఅఎవ ఎఇదిలాఉంటే, ఈ నెల 8వ తేదీన జారీ చేసిన మెమోలో.. ఇతర రాష్ట్రాలలో హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో దానిని వ్యాప్తిని నిరోధించేందుకు, కోళ్ల జనాభాను కాపాడటానికి అవసరమైన బయో సెక్యూరిటీ చర్యలను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పౌల్ట్రీ రైతులు, వాటాదారులు, ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లను కోరారు. హెచ్‌పీఏఐ వ్యాప్తి నివారణలో భాగంగా జబ్బు పడ్డ కోళ్ల రవాణా చేయరాదని, చనిపోయిన కోళ్లను సరైన పద్ధతిలో పూడ్చిపెట్టాలని.. ఈ బయో సెక్యూరిటీ పద్ధతుల గురించి వారికి తెలియజేయాలని చెప్పారు. కోళ్ల అసాధారణ మరణాలను వెటర్నిటీ సిబ్బంది, పశు సంవర్ధక శాఖకు తెలియజేయాలని వారికి సూచించాలని కూడా పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అటవీ శాఖ, పోలీసు శాఖ, ఆరోగ్య శాఖ, వెటర్నిటీ, పశుసంవర్ధక శాఖ అధికారులతో జిల్లా స్థాయిలలో సమావేశం ఏర్పాటు చేసి.. ఇతర రాష్ట్రాల నుంచి హైలీ పాథోజెనిక్ ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా తెలంగాణలోకి వ్యాప్తి తీసుకోకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై చర్చించాలని కోరారు.

# భారత డిజిటల్ విప్లవం ప్రశంసనీయం:ప్రధాని మోడీ

ప్రధాని ఉద్ఘాటించారు. భారత డిజిటల్ విప్లవాన్ని ప్రధాని మోడీ శ్లాఘిస్తూ, ‘భారత్ అత్యంత తక్కువ వ్యయంతో 140 కోట్ల మంది ప్రజల కోసం డిజిటల్ సార్వత్రిక మౌలికవసతులను విజయవంతంగా నిర్మించింది. దానిని సార్వత్రిక, అందుబాటులోని నెట్‌వర్క్ ఆధారంగా నిర్మించడమైంది. మా ఆర్థిక వ్యవస్థను ఆధునికం చేసేందుకు, పాలనను సంస్కరించేందుకు, మా ప్రజల జీవితాలను మార్చేందుకు విస్తృత శ్రేణి అవకాశాలు, నిబంధనలు ఉన్నాయి%ఢ% ప్రస్తుతం భారత్ డేటా రక్షణపై ఎఐ అనుసరణ, సాంకేతిక న్యాయపరమైన పరిష్కారాల్లో సారథ్యం వహిస్తోంది%ఢ% ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిక మేధ విభాగాల్లో ఒకటి మాకు ఉన్నది’ అని మోడీ తెలియజేశారు.శిలాజేతర ఇంధన శక్తి ఉపయోగించడంతో భారత దేశం మూడు రెట్లు పెరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. వివరించారు. సౌర ఉత్పత్తిని సామర్థ్యాన్ని డబుల్ చేసి మూడో అతిపెద్ద సౌరశక్తిని ఉత్పత్తి చేసే దేశంగా భారత్ నిలిచిందని మెచ్చుకున్నారు. భారత్ ఇంధన వార్షికోత్సవాలు 2025ను ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న పిఎం మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండియా తన వృద్ధిని సాధించడంతో పాటు ప్రపంచ వృద్ధి రేటును నడిపిస్తోందని ప్రశంసించారు. ఇంధన రంగంలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తుందని ప్రశంసించారు.21వ శతాబ్దం భారత్‌దేనని ప్రపంచంలోని నిపుణులు చెబుతున్నారని, వనరులు, మేధో సంపత్తి, ఆర్థిక బలం, రాజకీయ స్థిరత్వం, ప్రపంచ సుస్థిరతపై భారత్‌కు నిబద్ధత ఉందని మోడీ స్పష్టం చేశారు. 2030 సంవత్సరం నాటికి జీరో కర్బన ఉద్గార లక్ష్యాన్ని పెట్టుకున్నామని, ప్రతి సంవత్సరం ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. పారిస్ జి20 ఒప్పంద లక్ష్యాలను చేరుకున్న తొలి దేశం భారతేనని, రానున్న రెండు దశాబ్దాలు భారత దేశానికి అత్యంత కీలకమని ఆయన తెలియజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, పిఎం మోడీ అధ్యక్షత వహిస్తున్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోడీ సమావేశం కానున్నారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే ‘స్థానిక’ ఎన్నికలు

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్‌ఎ తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, కొనాయిపల్లిలో మంగళవారం శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తమ హయాంలో జిల్లాలో 75 కోట్లతో అనేక దేవాలయాలను అభివృద్ధి చేశామని అన్నారు. కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మాజీ సిఎం కెసిఆర్ ఏ ముఖ్య కార్యక్రమం అయినా ఈ దేవాలయం నుండి ప్రారంభిస్తారని తెలిపారు.రూ.3 కోట్ల 60 లక్షలతో దేవాలయాన్ని కెసిఆర్ అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం వచ్చే విధంగా చూడాలని వేంకటేశ్వరస్వామిని కోరానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి 15 నెలలుగా దేవాలయాలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. కొత్తగా ఒక్క దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేయలేదని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూడా నిలిపివేశారని మండిపడ్డారు. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టుకల్లా రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చి మోసం చేశారన్నారు. జనవరి 26కి రైతు భరోసా అందరు రైతులకు ఇస్తామని ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. వానకాలం రైతుబంధు ఎగబెట్టి ఎనిమిది వేల కోట్ల రూపాయలు రైతులకు అందకుండా చేశారని విమర్శించారు. కెసిఆర్ కిట్టు



మహిళలకు అందించకుండా వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్నది కాంగ్రెస్ అన్నారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో, కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఈ పార్టీని ఓడగొట్టారని అన్నారు. ‘ప్రామిస్ దే సందర్భంగా మీరు ఇచ్చిన ప్రామిస్ నిలబెట్టుకోవాలని రేవంత్ రెడ్డికి కోరుతున్నాం’ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు జాప శ్రీకాంత్ రెడ్డి, దువ్వల మల్లయ్యనంగునూరు పిఎసిఎస్ ఛైర్మన్ కోలా రమేష్ గౌడ్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ ట్రంప్ పన్నుల మోత

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం పన్ను విధించారు. అది చూసేందుకు సాధారణంగానే కనిపించినా ట్రంప్ తన మొదటి హయాంలో అదే పని చేశారు. ఇబ్బందుల్లో ఉన్న అమెరికా ఉక్కు, అల్యూమినియం ఉత్పాదక సంస్థలకు ట్రంప్ అసలు లోహాల టారిఫ్‌ల వల్ల తీవ్రమైన ప్రపంచ పోటీ నుంచి ఒకింత ఉపశమనం కలిగించాయి. కొత్త టారిఫ్‌ల గురించి ఊహిస్తుండగానే ఉక్కు, అల్యూమినియం ఉత్పాదక సంస్థల వాటాలు సోమవారం ఊర్ధ్వ దిశగా సాగాయి. నుకోర్ 5.6 శాతం, క్లీవ్‌లాండ్‌క్లిఫ్స్ 17.9 శాతం, అల్కోవా 2.2 శాతం పెరిగాయి. అయితే, ట్రంప్ టారిఫ్‌లు క్రితం సారి వ్యతిరేక ప్రభావం చూపాయి. అవి కీలక మిత్ర దేశాలతో యుఎస్ సంబంధాలను దెబ్బ తీశాయి, ఉక్కు, అల్యూమినియం కొని వాటిని వస్తువుల తయారీకి ఉపయోగించే ‘దిగువ’ యుఎస్ ఉత్పాదక సంస్థల ఖర్చులను పెంచాయి. అటువంటి సంస్థల్లో ఒకటైన విస్కాన్సిన్ మెరిల్‌లోని మిచెట్ మెటల్ ప్రాడక్ట్ సిఇఒ టిమోతి జిమ్మర్‌మాన్‌కు ఆ కాలపు చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.‘మాపై గణనీయంగా ప్రభావం పడింది’ అని ఆయన చెప్పారు. ‘మేము ఎదుర్కొన్న సవాళు కనివిని ఎరగనివి శీఘ్ర ద్రవ్యోల్బణం ప్రభావాలు దేశీయ ఉక్కు ఉత్పత్తిదారులపై పడ్డాయి. కొన్ని నెలల్లోనే ఉక్కు ధరలు దాదాపు 70 శాతంపైగా పెరిగాయి. మా (ఉక్కు) సరఫరాదారులు తేలికగా కాంట్రాక్టులు రద్దు చేసుకుని ‘దీనిని తీసుకుంటే తీసుకోండి లేదా ఏదీ తీసుకోకండి’ అని అన్నారు’ అని తెలిపారు. అయితే, మిచెల్ మెటల్ ప్రాడక్ట్ తమ సొంత ఖాతాదారులతో కాంట్రాక్టులు కుదుర్చుకుంది. వాటిలో ఫర్నిచర్ తయారీ సంస్థల నుంచి టెలికమ్యూనికేషన్స్ సంస్థల వరకు ఉన్నాయి. అవి అధిక వ్యయాన్ని బదలీ చేయనివ్వలేదు. ఆయన సంస్థ లాభాలు స్తంభించాయి.



యూరోపియన్ ప్రత్యర్థి సంస్థలకు ఆయన సంస్థ వ్యాపారాన్ని వదులుకోవలసి వచ్చింది. ఆ సంస్థలు ట్రంప్ టారిఫ్‌ల ప్రభావానికి లోను కాలేదు. అప్పట్లో అమెరికాపై మొత్తంగా ఆర్థిక ప్రభావం పరిమితంగానే ఉన్నది. అది మళ్లీ పరిమితంగానే ఉండవచ్చు, ఎందుకంటే ఉక్కు, అల్యూమినియం దిగుమతులు దాదాపు 30 ట్రిలియన్ డాలర్ల యుఎస్ ఆర్థిక వ్యవస్థలో స్వల్ప మాత్రంగానే ఉంటాయి.అయినప్పటికీ విదేశీ ఉక్కు, అల్యూమినియంపై కొత్త పన్నులు , ట్రంప్ ఇతర దిగుమతి పన్ను యోచనలు ‘ఈ ఏడాది యుఎస్ ద్రవ్యోల్బణాన్ని పెంచవచ్చు, ప్రపంచ వృద్ధిని ప్రభావితం చేయవచ్చు’ అని క్యాపిటల్ ఎకనామిక్స్‌కు చెందిన జెన్నిఫర్ మెక్‌క్యూన్, హమద్ హుస్సేన్ సోమవారం సూచించారు. కాగా, ఉక్కు అల్యూమినియం టారిఫ్‌లు యుఎస్ మిత్ర దేశాలకు నష్టం కలిగిస్తాయి. కెనడా యుఎస్‌కు నంబర్ వన్ విదేశీ ఉక్కు, అల్యూమినియం సరఫరా దేశంగా ఉంటున్నది. మెక్సికో ఉక్కు సరఫరా దేశాల్లో మూడవ స్థానంలో ఉన్నది. జపాన్, దక్షిణ కొరియా కూడా యుఎస్‌కు ప్రధాంగా ఉక్కు ఎగుమతి దేశాలు. చైనాను ప్రపంచ ఉక్కు పరిశ్రమ సమస్యలకు మూలకారణంగా భావిస్తున్నారు. చైనాలో శ్రుతిమించిన ఉత్పత్తితో ప్రపంచాన్ని ఉక్కుతో ముంచెత్తి, ధరలను స్వల్ప మాత్రంగా ఉండేలా చేసింది. ఇది యుఎస్‌లోను, ఇతర దేశాల్లోను ఉక్కు తయారీ సంస్థలకు నష్టం కలిగించింది. అయితే, చైనా ఉక్కు సరఫరా స్వల్ప మాత్రంగా ఉంచేందుకు యుఎస్ ఇప్పటికు వాణిజ్య ఆంక్షలు ఉపయోగిస్తోంది. నిరుదు యుఎస్ ఉక్కు దిగుమతుల్లో చైనా వాటా రెండు శాతంలోపే ఉంది.–

## వారికి కులగణనపై మాట్లాడే హక్కు లేదు

ముస్లీం మైనారిటీ అనేది ఇప్పుడు కొత్తతి కాదు అని, అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్ క్రిందకు నెట్టవద్దని పొన్నం కోరారు. ఎర్ర చొక్కా వెసుకున్న వాళ్ళంతా నక్సల్స్ అనడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను నామినేషన్ సందర్భంగా ఎర్ర చొక్కా వేసుకున్నానని వివరణ ఇచ్చారు. అంతమాత్రాన తాను నక్సలైట్ ను అవుతానా? పొన్నం ప్రశ్నించారు.

## కెటిఆర్ తన చెల్లి కవితను చూసి నేర్చుకోవాలి

ఇబ్బంది అవుతున్నందు వల్ల ఈఓలుగా రెవెన్యూ ఉద్యోగులను తీసుకుంటున్నట్లు మంత్రి కొండా తెలిపారు. రెవెన్యూ శాఖ ఉద్యోగులను తీసుకోవడం కొత్తేమీ కాదని ఆమె పేర్కొన్నారు.రాష్ట్రంలో ఎక్కడెక్కడ కుంబాభిషేకాలు చేయాలో అధికారులను జాబితా తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. కాళేశ్వరంలో కుంభాభిషేకం చేయక 42 ఏళ్లు అవుతుందని మంత్రి గుర్తు చేశారు. గత పదేళ్లలో దేవాదాయ శాఖ భూములు కబ్జా అయ్యాయని మంత్రి తెలిపారు. న్యాయపరంగా ఇబ్బంది లేని దేవాదాయ శాఖ భూములను మొదటి దశలోనే సర్వే చేయాలని అదేశించినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఈ సర్వేలు చేయడానికి వెళ్లిన సర్వేయర్ల దాడులు జరిగినట్టు ఎక్కడా ఫిర్యాదులు అందలేదని మంత్రి పేర్కొన్నారు.దేవర యాంజాల్‌లో దేవాదాయ శాఖ భూమిని కబ్జా చేశారని గతంలో బిజెపి నేత ఈటెల రాజేందర్ పై వచ్చిన ఆరోపణలపై మంత్రి కొండా సురేఖ స్పందిస్తూ త్వరలోనే దానిపై విచారణ జరుగుతుందని మంత్రి తెలిపారు. కులగణనతో పాటు బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని బిఆర్‌ఎస్ నేతలు తమపై విమర్శలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్ల విలువ ఇప్పుడే అర్థం కాదని వాటిని అమలు చేశాక దానివల్ల ఎంత లాభం ఉంటుందో అందరికీ అర్థమవుతుందని మంత్రి పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు, ఇతర అంశాల్లో బిసిలకు న్యాయం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు.

## 17న ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలి:కెటిఆర్

నాయకులు బిగాల గణేష్, శంకర్ నాయక్,గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో–ఫౌండర్ రాఘవ సమక్షంలో కెటిఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవటమే కెసిఆర్‌కు మనం ఇచ్చే పుట్టినరోజు కానుక అని పేర్కొన్నారు. వృక్షార్చన కార్యక్రమం తీసుకున్న పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌ను కెటిఆర్ అభినందించారు. రాష్ట్రం, దేశం పచ్చబడాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేస్తున్న ఈ వృక్షార్చనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సంతోష్ కుమార్ కోరారు. హరితసేనలోని సభ్యులందరూ మొక్కలు నాటి అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు.

## రేవంత్ సర్కార్ ప్రతి మహిళకు రూ.35,000 బాకీ పడింది:ఎంఎల్‌సి కవిత



కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని చేయాలని అల్టిమేటం జారీ చేశారు. మంగళవారం నాడు తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో తన నివాసంలో ఎంఎల్‌సి కవిత సమావేశమయ్యారు. మహిళలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం విషయంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవిత మాట్లాడుతూ%ౌ%కెసిఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేశామని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. మాయ మాటలు చెప్పి, అబద్ధపు హామీలు ఇచ్చి మహిళలను రేవంత్ రెడ్డి మోసం చేశారని విరుచుకుపడ్డారు. ప్రతి మహిళకు నెలకు రూ.2500 చొప్పున డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గెలిచినా కూడా అమలు చేయకపోవడం దారుణం అని మండిపడ్డారు.14 నెలల డబ్బు రూ. 35,000 కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బాకీ పడిందని, మహిళా దినోత్సవం లోపు ఈ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ, ఆడపిల్లలందరికీ ఉచితంగా స్కూటీలు అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు పెట్టి మిగతా పథకాలను తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. తాము మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ప్రభుత్వం మరిన్ని బస్సులు పెంచి ప్రజా రవాణాను సులభతరం చేయాలని సూచించారు. కేవలం మహిళలనే కాకుండా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. మహిళల పేరిట ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ ప్రక్రియనే మొదలుపెట్టలేదని ఎత్తిచూపారు. సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని ఇప్పటికీ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్లను తక్షణమే రూ. 4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉక్కు ఎగుమతి దేశాలు. చైనాను ప్రపంచ ఉక్కు పరిశ్రమ సమస్యలకు మూలకారణంగా భావిస్తున్నారు. చైనాలో శ్రుతిమించిన ఉత్పత్తితో ప్రపంచాన్ని ఉక్కుతో ముంచెత్తి, ధరలను స్వల్ప మాత్రంగా ఉండేలా చేసింది. ఇది యుఎస్‌లోను, ఇతర దేశాల్లోను ఉక్కు తయారీ సంస్థలకు నష్టం కలిగించింది. అయితే, చైనా ఉక్కు సరఫరా స్వల్ప మాత్రంగా ఉంచేందుకు యుఎస్ ఇప్పటికు వాణిజ్య ఆంక్షలు ఉపయోగిస్తోంది. నిరుదు యుఎస్ ఉక్కు దిగుమతుల్లో చైనా వాటా రెండు శాతంలోపే ఉంది.

## కుంభమేళా నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం ఏడుగురు హైదరాబాద్ వాసులు మృతి



భోపాల్: మహాకుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై ఏడుగురు మృతి చెందారు ఈ సంఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ౌ%. తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో నాచారానికి చెందిన భక్తులు ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు వెళ్లారు. భక్తులు ప్రయాగ్ రాజ్ నుంచి తిరిగి వస్తుండగా జబల్‌పూర్‌లోని సిహోరా గ్రామ శివారులో రాంగ్‌రూట్‌లో వచ్చిన లారీ, మినీ బస్సుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనా స్థలంలోనే చనిపోయారు. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వాహనం నంబర్ ఎపి 29 డబ్లు 1525గా ఉండడంతో ఆంధ్రప్రదేశ్ తొలుత పోలీసులు భావించారు. బాధితుల వద్ద గల ఆధార్ కార్డుతో నాచారం వాసులుగా గుర్తించారు. మృతులు, క్షతగాత్రులు పేర్లు ఇంకా వెల్లడించలేదు.

సత్యమేవ జయతే



## ఎడిటోరియల్

# తెల్లదొరలపై తొలి తిరుగుబాటు యోధుడు



జారండ్ అంటేనే వీరోచిత పోరాటాల వేదిక అన్నది విదితమే. ఎన్నో ఉద్యమాలు ఆ నేలపైన ఊపిరి పోసుకున్నాయి. మరుగునపడిన స్వాతంత్ర్యోద్యమ వీరుడు జారండ్‌కు చెందిన తిలకా మాంజీ వంటి గిరిజన వీరులు తమ హక్కులకోసం ప్రాణాలకు ఎదురొడ్డి పోరాటం చేశారు. సిద్ధూ, కానూ, భూమిజ్ సర్దార్, వీర బుద్ధూ భగత్, తానా భగత్, భగవాన్ బిర్సా ముండా మొదలైన యోధులు పరాయి పాలకుల గుండెలలో అగ్నిజ్వాలలు రగిలించారు. ఈ మహాయోధుల త్యాగాలకు చరిత్రపుటలలో సముచిత స్థానం లభించలేదు. జారండ్ నుంచి ఆంగ్లేయులపై వ్యతిరేకంగా తిరుగుబావుటా ఎగరేసిన ఆదివాసీ యోధుడు 'తిలకా మాంజీ'. మాంజీ బాల్యం నుంచే బ్రిటీష్ వాళ్ల అరాచకాలను, ఆకృత్యాలను కళ్లారా చూశాడు. తమ భూములను, పంటలను తెల్లదొరలు దోపిడీ చేయడం మాంజీకి ఆగ్రహం తెప్పించింది.

శనాచార్ (బనాచారి జోర్) నుంచి మాంజీ బ్రిటిష్ వారిపై తిరుగుబాటుకు పిలుపునిచ్చాడు. ఆయన పిలుపు మేరకు భాగల్పూర్, సుల్తాన్ గంజ్ అడవులలో గిరిజన యోధులు పోరాటం చేశారు. 1767లో 17 ఏండ్ల వయస్సు కలిగిన తిలకా మాంజీ మహల్ ప్రాంతంలో బ్రిటిష్ సైనికులతో తలపడ్డారు. వీరి పోరాట ఉధృతిని తట్టుకోలేక గిరిజన వీరులను అణిచివేయడానికి బ్రిటిష్ పాలకులు అగస్టిస్ క్లీవ్ ల్యాండ్ అనే ప్రత్యేక అధికారిని నియమించారు. 1770లో తీవ్ర కరువు వచ్చింది. ఆ కష్టకాల పరిస్థితులను ఎదుర్కొంటూనే గిరిజనులను కూడదీసిన మాంజీ దేశీయ, స్థానిక ఆయుధాలతో గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసాడు. ముంగేర్, భాగల్పూర్, సంతాల్, వర్ధణా ప్రాంతంలోని అడవులు, లోయలు, నదుల మధ్య శత్రువులతో పోరాటం చేశాడు. క్లీవ్ ల్యాండ్ వీరిని ఎదుర్కోవడంలో విఫలమయ్యాడు.తిలకా 1784, జనవరి 13న క్లీవ్యాండ్‌ను హతమార్చాడు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం భయంతో కంపించిపోయింది.మాంజీ తిరుగుబాటు దేశంలో బ్రిటిష్ వారిపై జరిగిన తొలి తిరుగుబాటుగా పరిగణించబడింది. ఆయనను పట్టుకుని హతమార్చాలని బ్రిటిష్ ప్రభుత్వం పథకం వేసింది. సంగీతం, నృత్యాలతో వేడుక చేసుకుంటున్న తిలకా సంతాల్ బృందం పై దేశద్రోహి అయిన ఒక భూస్వామి సహాయంతో బ్రిటిష్ సైనికులు దాడి చేశారు. తన అనుచరులను, కొందరు గిరిపుత్రులను హతమార్చారు. మరి కొందరిని నిర్బంధించారు. తిలకా మాంజీ తప్పించుకుని సుల్తాన్ గంజ్ కొండలకు చేరుకున్నాడు. బ్రిటిష్ సైన్యం అన్వేషణ కొనసాగించింది. ఫలితంగా అజ్ఞాతంలో ఉన్న సంతాల్ సైన్యం కష్టాల పాలైంది. తిండి, నీరు లేక నీరసించింది. సైనికులు ప్రాణాలు కోల్పోసాగారు. అయినా సంతాల్ సైన్యం గెరిల్లా యుద్ధం కొనసాగించింది. దురదృష్టవశాత్తు తిలకా మాంజీ తిలాపూర్ అడవులలో పట్టుబడ్డాడు.బ్రిటిష్ సైన్యం అతనిని అత్యంత కిరాతకంగా, నాలుగు గుర్రాలు కట్టి, నేలపై ఈడుస్తూ భాగల్పూర్ కలెక్టర్ నివాసానికి తరలించింది. 1785 ఫిబ్రవరి నెలలోనే ఒక మర్రి చెట్టుకి ఉరివేసి ఆ వీరుడిని హతమార్చింది. ఈ భూమి నా కన్నతల్లి. నా మాతృభూమి. ఈ మాతృభూమి కోసం ఎవరికో శిస్తు చెల్లించడం ఏమిటి? 'చిన్న వయసులో ఆలోచించి పరదేశీయులను ధిక్కరించిన ధీరుడు. ఆయన త్యాగనిరతికి గుర్తుగా భాగల్పూర్‌లో ఒక విశ్వవిద్యాలయానికి తిలకా మాంజీ పేరు పెట్టారు. నీ శరీరంమీద కొరడాల వాన కురిసింది. వారు నిన్ను గుర్రాలకు కట్టి లాక్కెళ్లారు. అయినప్పటికీ వారు నిన్ను చంపలేకపోయారు. భాగల్పూర్ ప్రజల గుండెలలో నీవు సజీవుడవే, నిన్ను ఉరితాడుకు వేలాడదీశారు. అయినా భూస్వాములు, బ్రిటిష్ పాలకులు భయపడుతూనే ఉన్నారు. కోపంతో ఎర్రబడిన నీకండ్లు చావు నిన్ను మా నుంచి దూరం చేయలేదని చెబుతూనే ఉన్నాయి. నిన్ను చంపిన తర్వాత కూడా నువ్వు బతికే ఉన్నావు.

# మాదకద్రవ్యాలే తీవ్ర సమస్య



'మాదకద్రవ్యాల అక్రమ రవాణా, జాతీయ భద్రత' అంశంపై 2022 అక్టోబర్ 8న గౌహతిలో ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాన కార్యదర్శులు, పోలీస్ డైరెక్టర్ జనరల్స్ (డిజిపిల) సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈశాన్య భారతంలో మాదకద్రవ్యాల వినియోగమే తీవ్ర సమస్య అని అన్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ప్రచురించిన 'మాదకద్రవ్యాల తీవ్రత నివేదిక 2019' ప్రకారం ఏడు ఈశాన్య రాష్ట్రాలలో నల్లమందు, గంజాయి వినియోగం ప్రమాదకర స్థాయిలో ఉంది. అది దేశంలో వాటి సగటు వినియోగం కన్నా అధికం. దేశంలో మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్ విధ్వంసానికి పన్నిన వ్యూహం విజయవంతం కావడం ఈ స్వల్ప వ్యవధిలో బాగా కానవచ్చిందని అమిత్ షా చెప్పారు.

తన వాదనకు మద్దతుగా కేంద్ర హోం శాఖ మంత్రి 2006, 2013 మధ్య 1257 కేసులు నమోదు చేసినట్లు, అవి 2014, 2022 మధ్య 152 శాతం పెరిగి 3172 కు చేరుకున్నట్లు తెలిపారు. అదే కాలంలో అరెస్టుల మొత్తం సంఖ్య 1362 నుంచి 260 శాతం పెరిగి 4888కి చేరుకున్నాయి. 2006 2013 కాలంలో 1.52 లక్షల కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అవి 20142022 కాలంలో 3.30 లక్షల కిలోలకు పెరిగాయి. 2006 2013 కాలంలో రూ. 768 కోట్లు విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అవి 2014 2022 మధ్య 25 రెట్లు పెరిగి రూ. 20 వేల కోట్లకు చేరుకున్నాయి. అయితే, మాదకద్రవ్యాల ఉత్పత్తి, సరఫరా ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయని అమిత్ షా వెలువరించిన గణాంకాల ద్వారా స్పష్టం అవుతోంది.స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, మాదకద్రవ్యాలు రెండింతలు కావడం నిషిద్ధ మాదకద్రవ్యాల సప్లయర్లను, ఉత్పత్తిదారులను మరింతగా సరఫరా, సాగు చేయకుండా నిరుత్సాహపరచడం గాని, అడ్డుకోవడం గాని జరగలేదు. బ్రిటిష్ ఇండియాలోని ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో అత్యధిక విలువ చేసే సరకుల్లో నల్లమందు ఒకటి. ఆ ప్రాంతంలో నల్లమందును ప్రవేశపెట్టడం తమ వలస ప్రాంతాల్లో అధిక విలువగల సరకుల వర్తకం చేయాలనే బ్రిటిష్ విధానానికి అనుగుణంగానే జరిగింది. ఆ విధానం ముడి వస్తువులను రాబట్టడానికి, కొత్త ప్రాంతాలకు విస్తరించడానికి దోహదం చేసింది. రెండవది, వాణిజ్య పంటలు ప్రవేశపెట్టడమనే ఆ విధానం సున్నితమైంది. ఆ ప్రాంతంలో తేయాకును 'కనుగొనడానికి' దశాబ్దాల ముందే వాణిజ్య పంటగా నల్లమందును ప్రవేశపెట్టారు. తేయాకు తోటలతో పోలిస్తే విస్తీర్ణం తక్కువగానే ఉండేది.రెవెన్యూ సాధించే శక్తిపరంగా నల్లమందు విలువ టీ, ఉప్పుతో పోలిస్తే అత్యధికం. చివరగా నల్లమందును ప్రభుత్వ ఆధ్వర్యంలో గుత్తాధిపత్య వాణిజ్య నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయిస్తుండేవారు. నల్లమందు సాగును 1860 లో అసోంలోని బ్రిటిష్ భూభాగాల్లో నిలిపివేశారు. ఆ తరువాత నల్లమందు డిమాండ్లు అన్నిటినీ తక్కిన దక్షిణాసియా నుంచి నల్లమందు దిగుమతి ద్వారా తీర్చారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో, ప్రభుత్వ ప్రోత్సాహం గల టీ, నల్లమందు వ్యాపారాలు వనరులపై సామ్రాజ్య నియంత్రణను కొనసాగించి, రాష్ట్ర యంత్రాంగంపై ఒత్తిడి తగ్గించింది. నల్లమందు వ్యాపారంపై గుత్తాధిపత్యం శ్రామికులు/ వనరుల నియంత్రణకు, సామ్రాజ్యానికి నిధుల సమీకరణకు కీలకం. తన వ్యాపార ప్రయోజనాల విస్తరణ, సుస్థిరతకు ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో వలసవాద ప్రభుత్వం 'నార్కో స్టేట్'ను నిర్మించింది. అసోం పోలీసులు గోల్‌పారా జిల్లాలో రూ. 27.20 కోట్లు విలువ చేసే 170 బిఘాల అక్రమ గసగసాల సేద్యాన్ని ధ్వంసం చేశారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ మాదకద్రవ్యాల సేద్యంపై చర్యను శ్లాఘించారు.మణిపూర్‌లో వివిధ శాంతి భద్రతల సంస్థలు 2017 2024 మధ్య 19135.60 ఎకరాల్లో అక్రమ గసగసాల సాగును ధ్వంసం చేశాయి. అక్రమ గసగసాల సేద్యంలో పెరుగుదల ఇప్పటికే సంక్షుభిత మణిపురి సమాజానికి ముప్పుగా పరిణమించింది. మాదకద్రవ్యాలపై పోరులో వాటిని కట్టడి చేయడానికి మరింతగా నిర్బంధ విధానంతోపాటు ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకున్నది. అయితే, ప్రధానంగా అక్రమ గసగసాల సేద్యాన్ని అరికట్టే విధానంగా 'ప్రభుత్వ 'డ్రగ్స్‌పై పోరు' ప్రచారోద్యమంలో భాగంగా అనుసరించిన చర్యల సామర్థ్యాన్ని సహేతుక పరిశీలకులు ప్రశ్నించారు.స్థానికంగా అక్రమ గసగసాల సేద్యాన్ని అరికట్టడానికి ఆ చర్యలు ఏమాత్రం దోహదం చేయవని తుర్కియే, థాయిలాండ్ వంటి దేశాల్లోను, అఫ్ఘానిస్తాన్‌లో నల్లమందుపై తాలిబన్ నిషేధం నేర్చుకున్న గుణపాఠాలు సూచిస్తున్నాయి. నిర్బంధ చర్యల వినియోగంలో అఫ్ఘానిస్తాన్, థాయిలాండ్, లావోస్‌లలో కేసులు ఈ దృక్పథం లోపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. అది 'గాలిబుడగ ప్రభావానికి' దారి తీస్తుంది. అక్రమ సాగును కనిపెట్టలేనంత బలహీనంగా ప్రభుత్వ యంత్రాంగం ఉనికి ఉన్న మారుమూల ప్రాంతాలకు రైతులు వెళుతున్నారు. ఇప్పుడు ఉన్న నెట్‌వర్క్‌లను బలహీనపరచడానికి బదులు అది నల్లమందు ఉత్పత్తి, వర్తకాన్ని పర్యవేక్షించేందుకు, గుత్తాధిపత్యం వహించేందుకు జరిగే ఏ ప్రయత్నాన్నైనా తిప్పికొట్టే ఎత్తుగడలను ప్రోత్సహిస్తోంది. అంతేకాదు, రహస్యంగా వ్యవహరించేందుకు వారిని పురికొల్పుతోంది, ఆవిధంగా మార్కెట్ చేరుకోవడానికి పోలీసుల నిఘా తప్పించుకుని సాగేందుకు తమ నెట్‌వర్క్ వ్యవస్థను పటిష్ఠం చేసుకుంటున్నారు. అటువంటి ప్రభావాలను గమనించవచ్చు.మణిపూర్‌లో గత కొన్ని సంవత్సరాల్లో అక్రమ గసగసాల సాగులో కనీవినీ ఎరగని పెరుగుదల కానవచ్చింది. చాలా వరకు షెడ్యూల్డ్ తెగలు నివసించే రాష్ట్రంలోని పర్వత ప్రాంతాల్లో గసగసాల సాగు పెరిగింది. మణిపూర్ పోలీస్ శాఖలో ఒక విభాగం నార్కోటిక్, అఫైర్స్ బోర్డర్ (ఎన్ఎబి) సమాచారం ప్రకారం, అక్రమ గసగసాల సాగు ప్రదేశాలు ప్రధానంగా ఉఖ్రుల్, సేనాపతి, కాంగ్‌పోక్పి, కామ్‌జోంగ్, చురాచాంద్‌పూర్, తెంగ్‌నౌపల్ పర్వత జిల్లాల్లో కేంద్రీకృతమైంది. 2020 నుంచి సమాచారం నమోదు చేసిన 2021 ఫిబ్రవరి వరకు 1420 ఎకరాల గసగసాల తోటలను శాంతి భద్రతల సంస్థలు ధ్వంసం చేశాయి. 201719 త్రైవార్షిక సమయంలో మణిపూర్ పోలీసులు 2858 ఎకరాల గసగసాల సాగు విస్తీర్ణాన్ని ధ్వంసం చేశారు. మణిపూర్‌లో డ్రగ్స్ దుర్వినియోగం తీవ్ర స్థాయిలో కలవరం కలిగిస్తోంది. అది యువజనులు, పిల్లలతో సహా సమాజంలోని ప్రతి వర్గాన్ని అది ఆవహించింది. కొన్ని సార్లు తుదకు అధికారులు, రాజకీయ నేతలు కూడా మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడ్డారు. మాదకద్రవ్యాల సూత్రధారి అరెస్టుపై మణిపూర్ పోలీస్ అధికారి, అధికార పార్టీకి చెందిన ఒక రాజకీయ నాయకుని మధ్య ఇటీవల నెలకొన్న ప్రతిష్టంభన మణిపూర్‌లో మాదకద్రవ్యాలు ఎంతగా చొచ్చుకుపోయాయో, అవినీతి ఎంతగా ప్రబలిందో వెలుగులోకి తెచ్చింది.ప్రతి భృతిగా ఏకకాల నగదు ప్రోత్సాహకాలు, ధ్వంసం చేసిన పంటలకు పరిహారం, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం వంటివి ప్రవేశపెట్టడం గసగసాల మొక్కల అకస్మాత్ ధ్వంసం కన్నా రైతుల అవసరాలపై దృష్టి పెట్టవలసి ఉంటుంది. ప్రధాన స్రవంతి వ్యవసాయంతో పోలిస్తే గసగసాల సేద్యం ఒక విధంగా తేలిక. ఈ పంటను ఏడాదికి రెండు సార్లు సాగు చేయవచ్చు. వేసవి ఆరంభంలో, శీతాకాలంలో ఇది కోతకు వస్తుంది. అత్యంత నిరుపేదలు ఎక్కువగా ఉన్న ఆదివాసీ రైతులు తమకు ప్రభుత్వం అండలేని కారణంగా మారుమూల పర్వత ప్రాంతాల్లో గసగసాల సాగును ఇష్టపడుతున్నారు. ఝుమియాలకు భూమి తేలికగా లభిస్తున్నందున ఇతర పంటలతో పాటు గసగసాల సేద్యం సులభం. దారిద్ర్యమే గ్రామీణ ప్రాంతాల్లో గసగసాల సేద్యానికి ప్రధాన కారకంగా ఉంటోంది. రాష్ట్ర యంత్రాంగం వైఫల్యం కూడా ఇందుకు ఒకింత కారణం. దశాబ్దాలుగా సాగుతున్న సాయుధ సంఘర్షణలు, తిరుగుబాటు సమస్యలు, జాతుల హింసాకాండ రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది, ఇది నిరుపేదలను మరింతగా ఇక్కట్ల పాల్జేసింది.వివిధ గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు అమలు పరుస్తున్నప్పటికీ అవి చివరి లబ్ధిదారులకు ఉపయుక్తం కావడంలేదు. పైగా, పిల్లలకు మెరుగైన విద్య అందించాలన్న, ఆధునిక సాధనాలు, టెక్నాలజీ సమకూర్చుకోవాలన్న అభిలాష ఆధునిక సమాజంలో ఎక్కువ ప్రాధాన్యం పొందుతోంది. ఆ క్రమంలో ఆహార పంటల సాగు గ్రామీణ ఆదివాసీ కుటుంబాల అవసరాలను తీర్చలేకపోతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు మనుగడ కోసం తంటాలు పడుతున్నారు, మెరుగైన ఆదాయ వనరు కోసం పోటీపడుతున్నారు. స్వల్ప వ్యవధిలో పేదరికం నుంచి విముక్తం కావడానికి గ్రామీణ కుటుంబాలకు గసగసాల సేద్యం 'మ్యాజిక్ కషాయం'గా ఉపయోగపడుతోంది. ఆర్థిక, ఆహార భద్రత కల్పనకు, పరపతి/ రుణాల లభ్యతకు అది మరింత ఉపయుక్తంగా వారికి కనిపిస్తోంది. తమ పంట (గసగసాలు) విక్రయం వల్ల మంచి ఆదాయం లభిస్తుందని తెలుసు కనుక తమకు డబ్బు అప్పు ఇవ్వడానికి జనం వెనుకాడడం లేదని స్థానిక మీడియా ఇంటర్వ్యూ చేసిన ఒక గసగసాల రైతు చెప్పాడు.అంతే కాకుండా, ఆ సేద్యం మణిపూర్ గ్రామీణ ప్రాంతాల్లో భారీ ఎత్తున వ్యవసాయ పద్ధతిగా మారిపోయింది. పేదరికం నుంచి విముక్తులైన వారు కూడా తమ కొత్త జీవన స్థితిగతులు కొనసాగించేందుకు గసగసాల సాగును కొనసాగించారు. ఈ అటవీ ప్రాంతంలో క్రియాశీలకంగా ఉన్న మాదకద్రవ్యాల వర్తకానికి రాజకీయ సరిహద్దులు లేవు. హెరాయిన్ వంటి, నల్లమందు, గసగసాల నుంచి తయారైన అన్ని రకాల డ్రగ్స్‌ను ఈ ప్రాంతంలో అధికారులు ఎప్పటికప్పుడు స్వాధీనం చేసుకుంటున్నారు. రాజకీయ నాయకులు, వాణిజ్యవేత్తలు, పోలీస్, మిలిటరీ అధికారులను అరెస్టు చేశారు. ఇది మణిపూర్‌లో ఈ సమస్య ఎంతగా ప్రబలిందో తేటతెల్లం చేస్తోంది. అయితే, 2017 నుంచి పర్వత ప్రాంత జిల్లాల్లో గసగసాల సాగుపై మణిపూర్ ప్రభుత్వం నిరంతరం ఉక్కుపాదం మోపుతుండడం ఈ వివాదాస్పద పంట పండిస్తున్న ఆదివాసీ రైతుల్లో ఆగ్రహాన్నిపెంచుతోంది.జాతుల మధ్య సంఘర్షణలు ప్రజ్వరిల్లడానికి ఐదు మాసాల ముందు 2022 డిసెంబర్‌లో గసగసాల పొలాలను ధ్వంసం చేసే భారీ కార్యక్రమం కోతల సీజన్‌లోనే జరిగింది. దీనితో ఆరు నెలల సేద్యంనుంచి డబ్బు ఆర్జించాలన్న ఆశలు అన్నీ అడుగంటాయి. కొండ తెగలవారు, ముఖ్యంగా భారత, మయన్మార్ సరిహద్దుకు రెండు వైపుల చారిత్రకంగా నివసిస్తున్న కుకి జోమి తెగవారు భారత వ్యతిరేక విదేశీశక్తుల మద్దతులో తిరుగుబాటు వర్గాల సాయంతో మణిపూర్‌లో అస్థిరత సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని మణిపూర్‌లోని అధికార పార్టీ వినిపిస్తున్న కథనం మణిపూర్‌లోని దుర్బల కొండ తెగలవారిని ఆర్థికంగా, సాంఘికంగా పరిరక్షించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే యత్నంగా కనిపిస్తోంది.

# అక్రమ వలసదారుల్ని వెనక్కు




అక్రమ వలసదారులపై అమెరికా ఉక్కుపాదం మోపి వారిని వెనక్కు పంపుతుంటే భారత్‌లో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. దేశం లోకి చొరబడిన అక్రమవలసదారులను వెనక్కు పంపకుండా కాలయాపన చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం అసోం ప్రభుత్వంపై ఇటీవల ఆగ్రహించడం గమనార్హం. వారిని పంపించడానికి ముహూర్తం కోసం చూస్తున్నారా అని వ్యాఖ్యానించింది. 'వారి దేశం ఏదో మీకు తెలుసు. వారి చిరునామా ఏదో తెలిసేవరకు మీరు ఎలా వేచి ఉంటారు? వారు ఎక్కడికి వెళ్లాలో ఆ దేశం నిర్ణయించుకుంటుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వారిని వెనక్కు పంపే విషయంలో విదేశాంగ మంత్రిత్వశాఖ సహాయం కోరుతూ ఎందుకు ప్రతిపాదనను సమర్పించలేదని నిలదీసింది.అక్రమవలసదారులను వెనక్కు పంపడంలో అమెరికా ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి చూసైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కోవాల్సిన అవసరం ఏర్పడింది. అమెరికాలో వీసా గడువు ముగిసిన వారు, అక్రమ వలసదారులు లక్షల సంఖ్యలో ఉన్నారు. అటువంటివారిలో 18,000 మంది భారతీయులున్నారని అమెరికా ప్రభుత్వం గుర్తించి వెనక్కు పంపడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మన దేశంలో అక్రమ చొరబాటుదారులుగా గుర్తించిన వారిని వెంటనే వెనక్కు పంపకుండా తీరని జాప్యం చేస్తున్న అసోం ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌తో సరిహద్దు కలిగిన పశ్చిమబెంగాల్, అసోం వంటి రాష్ట్రాల్లో అక్రమ చొరబాట్ల సమస్య చాలా ఎక్కువగా ఉంది. తృణమూల్ కాంగ్రెస్ పాలనలో ఉన్న పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమవలసదారులను వెనక్కు పంపడం లేదు.ఎందుకనో వీరికి ఓటరు గుర్తింపు కార్డుతో సహా మిగతా ప్రయోజనాలన్నీ ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతుండడంలో రాజకీయ మతలబు ఏదో ఉందని విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ బంగ్లాదేశీ చొరబాటుదారులు స్థానిక ప్రజల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్నారని, మతోన్మాదంతో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికుల నుంచి ఆందోళనలు వస్తున్నాయి. ఈ పరిస్థితిని గమనించి కేంద్ర ప్రభుత్వం సరిహద్దు రాష్ట్రాల్లో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని తీసుకు వచ్చి అక్రమ చొరబాటుదారులను గుర్తించే ప్రక్రియ చేపట్టింది. అలా గుర్తించిన వారిని వెనక్కు పంపే ప్రయత్నంలో డిటెన్షన్ సెంటర్లలో చేర్చింది. అలాంటి గుర్తించిన 63 మందిని వెనక్కు పంపకపోవడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకసారి ఒక వ్యక్తిని అక్రమ చొరబాటుదారుగా గుర్తించాక, వెనక్కు పంపించాల్సిందే. ఆర్టికల్ 21 ప్రకారం సుదీర్ఘకాలం డిటెన్షన్ సెంటర్లలో నిర్బంధించి ఉంచడం చెల్లదు. అందుకనే రెండు వారాల్లో వారిని తిరిగి వెనక్కు పంపేయాలని, అలా పంపించినట్టు అఫిడవిట్ సమర్పించాలని అసోం ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.అయితే అసోం సీనియర్ అధికారి వర్గాలు ఈ విషయంలో తామే నిర్ణయం తీసుకోలేమని, వారిని వెనక్కు పంపాలన్న నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి తప్ప అసోం రాష్ట్రం స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే హక్కులేదని స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేసామని, మళ్లీ దీనిపై రాస్తామని అసోం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే అక్రమవలసదారులను వెనక్కి పంపే ప్రక్రియను బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) చేపట్టవలసి ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం.. ఎవరినైతే తిరిగి వెనక్కుపంపించడానికి మనం సిద్ధమవుతామో, వారిని చేర్చుకోడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం తప్పనిసరిగా అంగీకరించాల్సి ఉంటుంది. దేశంలోనే భారీ డిటెన్షన్ సెంటర్‌ను పశ్చిమ అసోం గోల్‌పరా జిల్లాలో 2023లో ఏర్పాటు చేయకముందు ఆరు జిల్లా జైళ్లు డిటెన్షన్ సెంటర్లుగా పనిచేసేవి. 2021 ఆగస్టులో అసోం ప్రభుత్వం ఈ కఠినమైన జైళ్ల వంటి డిటెన్షన్ సెంటర్లను మానవతా దృక్పథంతో తాత్కాలిక ఆశ్రయ శిబిరాలుగా మార్చింది.ప్రస్తుతం మటియా శిబిరంలో మాత్రమే విదేశీయులుగా ప్రకటించిన అక్రమ వలసదారులను ఉంచుతున్నారు. ఇక్కడ ఉండే మొత్తం 270 మంది అక్రమవలసదారుల్లో ఈ 63 మంది బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యా ముస్లింలుగా గుర్తించారు. ఇంకా మరో 750 మంది రెండేళ్లు డిటెన్షన్‌లో ఉండిన తరువాత బెయిలుపై బయటపడ్డారు. వీరిలో చాలా మంది కోర్టుల్లో కేసులతో పోరాడుతున్నారు. కొవిడ్19 మహమ్మారి సమయంలో.. రెండేళ్లకు మించి డిటెన్షన్ సెంటర్లలో ఉంటున్న అక్రమవలసదారులను కొన్ని షరతులపై తక్షణం విడుదల చేయాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమ వలసదారులు తాము వేరే దేశానికి చెందినవారమని నిరూపించుకున్నా లేదా సంబంధిత డాక్యుమెంట్లు చూపించినా వారిని వెనక్కు పంపడం సులువవుతుంది.అయితే అటాంటి ధ్రువపత్రాలు వారి వద్ద లేకుంటే అరెస్ట్ చేసే అవకాశం ఎక్కువ. అలాగే తాము భారతీయులమని వాదించినప్పటికీ, సరైన ధ్రువీకరణ పత్రాలు లేనందున విదేశీ ట్రిబ్యునల్స్ వీరిని విదేశీయులుగా ప్రకటించినప్పుడు వారిని స్వస్థలాకు తిరిగి పంపించే ప్రక్రియ చాలా కష్టం. బంగ్లాదేశ్‌లో వలసదారులు ఎవరైనా తాము బంగ్లాదేశీయులమే అని క్షేత్రస్థాయిలో నిరూపించే ధ్రువపత్రాలు లేకుంటే వారిని తమ దేశంలో చేర్చుకోవడానికి అంగీకరించరు. ఇదే విధంగా రోహింగ్యాలను చేర్చుకోవడానికి మయన్మార్ ఒప్పుకోవడం లేదు. అనేక ఉద్యమాల ఫలితంగా 1985లో కుదిరిన అసోం ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తరువాత అసోంలోకి ప్రవేశించిన వారిని నిబంధనల ప్రకారం అక్రమవలసదారులుగా పరిగణిస్తారు. వారిని వెనక్కు పంపిస్తారు.

# హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు రాళ్ల వర్షం కురిపిస్తారు

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సత్యమేవ జయతే -కంది** కంది మండలం చీమ్నపూర్ గ్రామంలో కట్ట మైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని. ..కంది కింగ్స్ దాబా వద్ద ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు మీడియా తో మాట్లాడారు.ఈ సందర్భంగాసంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ గారు మాట్లాడుతూ...ఖఅవగాహన లేని పాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొంసాగిస్తుంది... ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చెసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి ఖ కాంగ్రెస్ పాలనపై ప్రజలు కోపం మీద ఉన్నారు, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పాలనపై ప్రజలు రాళ్ల వర్షం కురుపిస్తారు...
ఖప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు...ఖ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చెసిన తరువాతే లోకల్ బాడీ ఎన్నికలకు వెళ్ళాలి.
ఖ అక్కచెల్లమ్మలకు కెసిఆర్ ఇచ్చే లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. ..తులం బంగారం సంగతి. ..?ఖ-మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైంది...ఖ హామీలు అమలు చేసే వరకు ప్రజల తరుపున పోరాటం చేస్తాం...కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, కంది మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కృష్ణ గౌడ్, ప్రభాకర్, మోహన్ రెడ్డి, మనోహర్ గౌడ్, తదుతరులు ఉన్నారు...



# ఎన్నికల నిర్వహణ నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి






### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు
### -గ్రామపంచాయతీ ఎన్నికలపై రిటర్నింగ్ అధికారులకు సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ

**సత్యమేవ జయతే -సంగారెడ్డి** గ్రామపంచాయతీ ఎన్నికలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం స్టేజ్1, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ,జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా ఆధ్వర్యంలో మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎంత అనుభవం వున్నా శిక్షణ చాలా అవసరమని అన్నారు . నియమ నిబంధనలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులు , సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తిస్థాయి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి వివాదాలకు తప్పిదాలకు తావు లేకుండా నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ద్వారా అందించబడిన కరదీపిక (హ్యాండ్ బుక్ ) ను చదువుకుని ఈ.సీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సిన రోజు నుండి , నామినేషన్ల స్వీకరణ ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకనుగుణంగా నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాల కోసం పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా కొత్త బ్యాంకు ఖాతాను తెరువాల్సి ఉంటుందని, ఈ ఖాతా ద్వారానే ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీలు జరుపాలని ఈ.సీ నిర్దేశించినందున నామినేషన్ పత్రాల కోసం వచ్చే అభ్యర్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. నామినేషన్ల దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈ.సీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్ లో ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతేనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని ,ఓటరు జాబితాలోని పేరును అక్షర క్రమం కోసం పరిగణలోకి తీసుకుంటే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు . అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్ సమర్పిస్తే అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి ,ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటి అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతిరోజు త్వరితగతిన డైలీ రిపోర్టును ఉన్నతాధికారులకు పంపించాలని, సంబంధిత వెబ్సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు . ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు నోటా సింబల్ ను కూడా తప్పనిసరిగా చేర్చాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ఆక్షేపణలు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికల ను నిర్వర్తించాలని ఎన్నికల అధికారులకు హితవు పలికారు. ఈ శిక్షణ తరగతుల్లో జానకి రెడ్డి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రామాచారి, ఏ పీ డి బాలరాజు, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు,ఎంపీడీఓలు,సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# 336 సర్వే నెంబర్ల లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహాశీల్దార్ వినతి

### 336 సర్వే నెంబర్ల లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహాశీల్దార్ వినతి

**సత్యమేవ జయతే న్యూస్/హత్నూర:**సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామ శివారులో గల 336 సర్వే నెంబర్ల లలో ఆక్రమణకు గురైనటువంటి ప్రభుత్వ భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని నిరుపేదలైన లబ్ధిదారులకు ఇండ్ల స్థలాల కేటాయించాలని మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహాశీల్దార్ పర్వీన్ షేక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు, మాట్లాడుతూ 2007- 2008 సంవత్సరంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కాసాల గ్రామంలో ఉన్నటువంటి నిరుపేదలైన వారు ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుని పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరిగింది అందుకు అప్పుడు ఉన్న రెవెన్యూ అధికారులు ఇండ్ల స్థలాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హుల జాబితాను ప్రకటించడం జరిగింది అన్నారు. కానీ రియల్ ఎస్టేట్ బాగా పెరగడంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడం సరైనది కాదని ఏది ఏమైనా కాసాల గ్రామంలో ఉన్నటువంటి నిరుపేదలైన అర్హులందరికీ ఇళ్ల స్థలాల కోసం భూమి కేటాయించాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్ కుమ్మరి గోపాల్, ఇంద్రసేన, తదితరులు పాల్గొన్నారు.





## ఇసుక ఫిల్టర్ స్థావరాలపై సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు..

### -సుమారు 6 కోట్ల విలువ గల ప్రాపర్టీ సీజ్..
### పోలీసుల అదుపులో 32- మంది వ్యక్తులు.
### -వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



**సత్యమేవ జయతే- సంగారెడ్డి** నమ్మదగిన సమాచారం మేరకు సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట్, బ్యాతోల్ గ్రామ శివారులలో కొంత మంది ఆక్రమార్కులు ఇసుక ఫిల్టర్ స్థావరాలను ఏర్పాటు చేసుకొని, భూసారాన్ని తగ్గించే విధంగా మట్టిని తవ్వి, అందులోంచి ఇసుకను వడకడుతూ అక్రమ ఇసుక దందాలకు పాల్పడుతున్నారని, మంగళ వారం జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు, స్పెషల్ పార్టీ టీమ్స్ రెండు బృందాలుగా ఏర్పడి ఇస్మాయిల్ ఖాన్ పేట్, బ్యాతోల్ గ్రామ శివారులో గల ఇసుక ఫిల్టర్ స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ దాడులలో.. ఇస్మాయిల్ ఖాన్ పేట్ గ్రామ శివారులో గల ఇసుక ఫిల్టర్ వద్ద 3-ఇటాచీలు, 2- జేసీబీలు, 5- ట్రాక్టర్, ట్రాలీ, 10- ట్రాక్టర్ ఇంజెన్స్, బ్యాతోల్ గ్రామ శివారులో గల ఇసుక ఫిల్టర్ వద్ద 3-ఇటాచీలనులి సీజ్ చేయడంతో పాటు మొత్తం 32 మందిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ కొరకు సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ కు తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎవరైనా అక్రమ ఇసుక ఫిల్టర్ స్థావరాలను ఏర్పాటు చేసినట్లు తెలిస్తే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ టాస్క్ ను విజయవంతం చేసిన టాస్కోర్స్ సిబ్బందికి మరియు స్పెషల్ టీమ్స్ కు జిల్లా ఎస్పీ అభినందనలు తెలియజేశారు.

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వనదుర్గ మాతకు ప్రత్యేక పూజలు





సంగారెడ్డి:నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంగారెడ్డి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు సంగారెడ్డి పట్టణం నుండి ఏడుపాయలకు బయలుదేరి వన దుర్గ మాతకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు లకుడారం మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు అయినా సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నామని తెలిపారు. అనంతరం పలుగు మీది పోచమ్మ దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సాయినాథ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం నాయి ఉపాధ్యక్షులు రంజిల్ ప్రభు, మురారి, కోశాధికారి స్వాగత్ ప్రభు యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మారేపల్లి నర్సింలు, సలహాదారులు పెంటయ్య, వీరభద్ర అంజయ్య, యూత్ కమిటీ అధ్యక్షులు చరణ్, ప్రధాన కార్యదర్శి రాము, కమిటీ సభ్యులు అనిల్ కుమార్, హనుమంతు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ గారిపై జరిగిన దాడి ప్రతి వ్యక్తి ఖండించాలి.
### సాహసం రాష్ట్ర అధ్యక్షులు డా ముప్పారం ప్రకాశం





**సత్యమేవ జయతే పుల్కల్ ప్రతినిధి**చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ గారి మీద రామ రాజ్యం అనే సంఘానికి కోపం ఎందుకంటే రంగరాజన్ గారు తన భుజాల మీద ఆదిత్య పరశ్రీ అనే దళిత సోదరున్ని ఆలయంలోకి తీసుకొని వెళ్ళాడు దీనిని ఒక పండగలా చేశాడుకానీ నరనరాన్న అగ్ర కుల అహంకారాన్ని నింపుకున్న కొన్ని హిందూ సంఘాలకు ఇది రుచించలేదు పైగా రంగరాజన్ గారు తన మతాన్ని ఎంతలా ప్రేమిస్తారో పరమత సహనాన్ని అంతే పాటిస్తారు ఇది ఆది నుండి కొన్ని సంఘాలకు జీర్ణం కాక... ఆయనను కొందరు బహిరంగంగానే విమర్శలు చేస్తూ తమ పైత్యాన్ని సమయం వచ్చినప్పుడల్లా ఇలా దాడులకు తెగబడి తమ ద్వేషాన్ని బయటపెట్టుకున్నారు.కాబట్టి చిలుకూరు దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ గారిపై దాడి ని అందరూ ఖండించాలి. తెలంగాణ ప్రజల మధ్యలో వైషమ్యాలను రెచ్చగొట్టే సంస్థలపై అప్రమత్తంగా వుండాలి. ప్రశాంత వాతవరణాన్ని కాపాడుకుందాం.
మీ..డా.ముప్పారం ప్రకాశం రాష్ట్ర అధ్యక్షులు "సాహసం"

సత్యమేవ జయతే



# విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలి






## టివిఏసి జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు

**సత్యమేవ జయతే:మెదక్** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని టివిఏసి జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు.ఈ నేల 3వ తేదిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రారంభమైనటువంటి ఆర్టిజన్ కన్వర్షన్ యాత్ర మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లాలో మేదక్ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన యాత్ర సభకు మెదక్ జిల్లా చైర్మన్ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేసినటువంటి ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ చేయాలని విద్యార్హతను బట్టి వారికి సబ్ ఇంజనీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్ ఆఫీస్ సబార్టేనేట్ పోస్టులని ఇవ్వాలని అనేక దపాలుగా పోరాటాలు నిర్వహించమన్నారు.గతంలో ఎన్నికల ముందు ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క పాదయాత్రలో కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి దృష్టి కూడా ఈ సమస్యను తీసుకెళ్లడం జరిగిందన్నారు

మేనేజ్మెంట్ దృష్టికి కూడా తీసుకెళ్ళమని చెప్పారు. 20వేల మంది ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన విద్యుత్ సౌధ వద్ద సిఎండి కార్యాలయానికి వేలాది మందితో మెమొరాడం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.అయినా కూడా ఈ సమస్యను పరిష్కరించకుంటే అర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయకపోతే భవిష్యత్తులో మెరుపు సమ్మెకు కూడా వెనుకాడమని ఈ సందర్భంగా హెచ్చరించారు కన్వర్షన్ యాత్రకు సిఐటియు మెదక్ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విజిర్ గారు, రాష్ట్ర కో కన్వీనర్ తిరుపతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర రెడ్డి గారు సిద్దిపేట జిల్లా చైర్మన్ గుంటుపల్లి సధాకర్, మెదక్ కన్వీనర్ దుర్గేష్, సంగారెడ్డి జిల్లా చైర్మన్ రాములు నాయకులు సందీప్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ కోవాలెంట్ పరిశ్రమ ముందు ఆందోళన.

## -అక్రమ నిర్మాణ పనులను అడ్డుకున్న గ్రామ ప్రజలు.







**సత్యమేవ జయతే న్యూస్/హత్నూర:** అక్రమ నిర్మాణాలను ఆపాలంటూ మంగళవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవాలంట్ రసాయన పరిశ్రమ ముందు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ శివారులోని కోవాలంట్ పరిశ్రమకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామపంచాయతీలో తీర్మానాలు చేసిన పరిశ్రమ యాజమాన్యం మొండివైఖరిగా ప్రవర్తిస్తుందన్నారు. గ్రామ సభలో అక్రమ నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వద్దని తీర్మానాలు చేసిన దానికి వ్యతిరేకంగా పరిశ్రమ యాజమాన్యం దొంగ చాటున పైప్ లైన్ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. పరిశ్రమ నుండి వచ్చే వ్యర్థ జలవాయువులను నక్క వాగులో వదిలేయడంతో మంజీరా పరిసర గ్రామాలు పూర్తిగా కాలుష్యమయమై పచ్చని పంట పొలాలు విషతుల్యమయ్యే ప్రమాదాలు ఉన్నాయని ఆరోపణలు చేశారు. సంబంధిత అధికారులు పరివాహ ప్రాంతం రైతులు నష్టపోకుండా కోవాలెంట్ పరిశ్రమ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పడిగళ్ల అశోక్







**సత్యమేవ జయతే, వికారాబాద్ ప్రతినిధి** వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డిని, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పడిగళ్ల అశోక్ ని నియమించామని నా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లి లోని బి ఆర్ ఎస్ భవన్ (జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం) లో నిర్వహించిన వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల, కార్యకర్తల అంతర్గత సమావేశానికి వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరయ్యారు. సమావేశంలో భాగంగా వికారాబాద్ మండల, గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు మహిపాల్ రెడ్డిని వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గా, పడిగళ్ల అశోక్ ని వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమించారు.ఈ కార్యక్రమంలో మాజీ టి ఎస్ ఈ డబ్ల్యూ ఐ డి సి చైర్మన్ నాగేందర్ గౌడ్,మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, మాజీ ఎంపీపీ చంద్రకళ కమాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ల సంగం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజి ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ జాతరలో ముఖ్య నేతలు

**సత్యమేవ జయతే న్యూస్/ కౌడిపల్లి**నర్సాపూర్ నియోజకవర్గంలో నేడు (బుధవారం) మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారి కార్యక్రమాలు:

1. కౌడిపల్లి మండలం వెంకట్రావ్ పేట్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి యంత్ర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారు.
2. కౌడిపల్లి మండలం కన్నారం గ్రామంలో గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్త, నర్సాపూర్ మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, లలిత నర్సింగ్, నర్సాపూర్



మండల అధ్యక్షులు మల్లేశం, కౌడిపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, రుస్తుంపేట మాజీ ఎంపీటీసీ అశోక్, పాషా, నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, నర్సాపూర్ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్, నర్సాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్,యాద గౌడ్, మోహన్ దాస్ గౌడ్, క్రిష్ణ ,నగేశ్, నర్సింలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

# పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



**సత్యమేవజయతే మనూర్** నారాయణఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలం దుదగొండ కు చెందిన సంజయ్ సోదరుడు ఏభిలేజర్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి దైర్యం చెప్పి అంత్యక్రియలకు హాజరైన డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి వీరితో పాటు మాజీ సర్పంచ్ శేరి రాజు, మోహన్ రెడ్డి,నర్సింహా గౌడ్,నర్సిములు ఇతర గ్రామ నాయకులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

# వీరభద్రేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు



**సత్యమేవజయతేనారాయణఖేడ్**నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని మంగల్ పేట్ లో ఈరోజు వీరభద్రేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వారితో పాటు శెట్టి శంకర్, వారి కుమారులు మరియు విట్టల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రేవంత్ సర్కార్ ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయింది

## భూములు, పైసల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నుకుంటున్నారు

## ఎమ్మెల్సీ గా గెలిపించి ఆశీర్వదించండి

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్



**సత్యమేవ జయతే:మెదక్** రేవంత్ నేత్రత్వంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ప్రజలకిచ్చినా హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విద్యార్ధి రాజకీయ పార్టీ బలపరిచిన కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి బక్క జడ్సన్ విమర్శించారు.మంగళవారం మెదక్ లో అయన విలేకర్లతో మాట్లాడారు.సీమాంధ్రులు దోచుకుంటున్నారని ప్రత్యేక రాష్ట్రం సాధిస్తే స్వరాష్ట్రంలో అవినీతి పెట్రేగి పోయిందన్నారు.వరంగల్ జైలును సైతం కుదువపెట్టారని ఆరోపించారు. తెలంగాణ లో 3.67లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగ భృతి ఇస్తామని, జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. జీవో 29 ని రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల ఘనన పచ్చి మోసం అని విమర్శించారు. రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఇప్పటివరకు రెండువేల మంది స్టూడెంట్స్ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.భూములు, డబ్బుల కోసం మంత్రులు, ఎమ్మెల్యే లు తన్నుకుంటున్నారని ఆరోపించారు. డబ్బు సంపాదనను కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమం లా చేస్తున్నారని ఏద్దేవాచేశారు. ధరణిని డ్రగ్స్ వాడేటోళ్లకు అప్పగించారని ఆరోపించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మేఘ కృష్ణారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు సంబందించిన సంస్థలకు అప్పగించారని ఆరోపించారు.వైద్య, విద్య శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతి కొనసాగటం దౌర్భాగ్యమన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటేసి ఆశీర్వదించాలని అయన విజ్ఞప్తి చేశారు.

# కల్హేర్ మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించిన మాజీ శాసనసభ్యులు



సత్యమేవజయతే నారాయణఖేడ్కల్హేర్ మండల కేంద్రంలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..మాసన్ పల్లి నుండి నల్ల వాగు వరకు మరియు కల్హేర్ నుండి పిట్లం వరకు కల్హేర్ నుండి రాపర్తి వరకు గత మా బిఆర్ఎస్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ రోడ్లన్నింటినీ శాంక్షన్ చేయించి టెండర్లు చేయించి కొన్ని రోడ్లు వర్క్ కూడా ప్రారంభించి పెట్టామని అంతలోనే ఎలక్షన్ వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రోడ్లు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండి ఏ ఒక్క రోడ్డు కూడా పనులు చేయడం లేదని తెలిపారు. రోడ్లు చేద్దామని కాంట్రాక్టర్లు ముందుకు వస్తే ఇప్పుడు ఉన్నా ఈ ఎమ్మెల్యే గారు మరియు ఎంపీ గారు ప్రభుత్వ పెద్దలు వారికి సహకరించడం లేదని తెలిపారు. అలాగే కల్హేర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనము అసంపూర్తిగా నిర్మించి ఉందని దానిని వెంటనే పూర్తిగా నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 30 పడకల ఆసుపత్రిని నిర్మించి ఇచ్చానని దానిలో డాక్టర్లు లేక ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని దానిలో డాక్టర్లను రిక్రూమెంట్ చేసి ప్రజలకు వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు గని,మాజీ సర్పంచ్లు బాలయ్య,గణపతి, మాజీ ఉపసర్పంచ్ సాయిలు గ్రామ పార్టీ అధ్యక్షులు పండరి, ఉపాధ్యక్షులు ప్రభు గౌడ్,నాయకులు నరసింహ గౌడ్, లక్ష్మణ్ నాయక్, శంకర్ నాయక్, ప్రమోద్ గౌడ్, సాయిలు,వెంకట్ నాయక్, బాబు, హరి సింగ్ తదితరులు ఉన్నారు.

# శేరి లింగంపల్లి జోన్ లో బల్దియా కమిషనర్ పర్యటన......



**సత్యమేవ జయతే - శేరి లింగంపల్లి** శేరి లింగంపల్లి : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో బల్దియా కమీషనర్ ఇలంబర్తి హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ,ట్రాఫిక్ సి పి జోయస్ డేవిడ్, ప్రాజెక్ట్స్ సిఇ భాస్కర్ రెడ్డి గారు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సహా ప్రాజెక్టు విభాగంతో పాటు ఇతర విభాగాల అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని ఐఐటి జంక్షన్ ,గచ్చిబౌలి జంక్షన్ ,రాడిసన్ జంక్షన్ ల వద్ద చేపట్టనున్న కూడళ్ల అభివృద్ధి సుందరీ కరణ పనులను కమిషనర్ పరిశీలించారు .ఐఐటి జంక్షన్ వద్ద హెచ్ సి టి పథకంలో కొత్తగా నిర్మించబోయే ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను ప్రాజెక్టు విభాగం అధికారులతో సమీక్షించారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కూడళ్ళ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను కమిషనర్ కు వివరించారు .ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ కూడళ్ళ సుందరీ కరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు .పెరుగుతున్న ట్రాఫిక్కు అనుగుణంగా కూడళ్లను అభివృద్ధిపరిచి వాహనాలు సులువుగా ముందుకు సాగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగని రీతిలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు .ఐఐటి జంక్షన్లో చేపట్టనున్న ఫ్లైఓవర్ ,అండర్ పాస్ నిర్మాణములకై ఆస్తుల సేకరణ ట్రాఫిక్ ఇతర అంశాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఐటి పరిశ్రమలు అధికంగా ఉన్న శేరిలింగంపల్లి జోన్లో రహదారుల విస్తరణ, కూడళ్ల సుందరీకరణ మరింత సౌకర్యాన్ని కలిగించేలా చూడాలని అధికారులను కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు .ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చంటున్న అధికారులు..




**సత్యమేవ జయతే - తెలంగాణ** తెలంగాణ : కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుదారులకు గుడ్‌న్యూస్.. మూడు రోజుల గందరగోళానికి తెర. మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చంటున్న అధికారులు.. కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి పౌర సరఫరాల శాఖ తీపికబురు తెలిపింది. ఇప్పటివరకు దరఖాస్తుల స్వీకరణ అంశంలో నెలకొన్న అయోమయానికి తెరదించింది. కొత్త దరఖాస్తులు మీ-సేవ ద్వారా స్వీకరించాలని నిర్ణయించింది. ఇందుకు సోమవారం సివిల్ సప్లయిస్ భవన్‌లో మీ సేవ అధికారులతో ఆ శాఖకు సంబంధించిన అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో మీ-సేవలో కొత్త దరఖాస్తులు స్వీకరించడానికి మీ-సేవ అధికారులు అంగీకారం తెలిపారు. దీంతో దరఖాస్తుల స్వీకరణ ఆప్షన్‌ను అధికారులు పునరుద్ధరించారు. దీని ఫలితంగా మీ-సేవ వెబ్‌సైట్‌లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారం సాయంత్రం నుంచి మొదలైంది. 3 రోజులుగా గందరగోళంలో దరఖాస్తుదారులు : ఫిబ్రవరి 7వ తేదీన కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు మీ-సేవ వెబ్‌సైట్‌లో ఆప్షన్ అందుబాటులో ఉంచాలని పౌర సరఫరాల శాఖ మీ-సేవ అధికారులకు ఓ లేఖను రాసింది. ఆ లేఖకు అనుగుణంగా అదే రోజు రాత్రి నుంచి వెబ్‌సైట్‌లో సదరు ఆప్షన్‌ను అధికారులు ఉంచారు. దీంతో ఆ ఆప్షన్ అందరికీ కనిపించింది. దీంతో కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకునే వారు ఆనందంగా మీ-సేవ కేంద్రాలకు వెళ్లి చేసుకోవచ్చని అనుకున్నారు. ఫిబ్రవరి 8వ తేదీన ఉదయం మీ-సేవ కేంద్రాల వద్దకు వెళ్లి పడిగాపులు కాశారు. మీ-సేవ కేంద్రాల సిబ్బంది ఆప్షన్‌ను తీసేశారని చెప్పడంతో అప్పటివరకు కేంద్రాల వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు అయోమయానికి లోనయ్యారు. కొన్నిచోట్ల విమర్శలు సైతం వచ్చాయి. దీంతో తాజా సమావేశంలో ఈ విషయమై పౌర సరఫరాల శాఖలో లోతైన చర్చే జరిగింది. ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ ఎప్పుడో మొదలై ఉండటం, కేబినెట్ నిర్ణయం ముందే జరగడంతో సాంకేతికంగా ఎలాంటి సమస్యలు రావన్న అభిప్రాయం ఉన్నతాధికారులు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని మీ-సేవ అధికారుల్ని పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో సోమవారం సాయంత్రం నుంచి దరఖాస్తుల స్వీకరణను మీ-సేవ నిర్వాహకులు ప్రారంభించారు. దీంతో రేషన్ దరఖాస్తులపై పౌర సరఫరాల శాఖ అనుసరించిన తీరుతో మూడు రోజుల పాటు దరఖాస్తుదారుల అందరిలో గందరగోళం నెలకొంది. మళ్లీ దరఖాస్తు చేయనక్కర్లేదు : కొత్తగా రేషన్‌కార్డుల కోసం కులగణన లేదా ప్రజాపాలన లేదా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ వర్గాలు తెలుపుతున్నాయి. ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదనిలి పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది.

# ఇకపై మా వల్ల కాదు బాబోయ్.. కుక్కలను చంపేందుకు అనుమతివ్వండి..

**సత్యమేవ జయతే - హైదరాబాద్**



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయని.. వాటిని కట్టడి చేయడం మా వల్ల కావడం లేదని.. గడిచిన ఐదు సంవత్సరాలలో 40 కోట్లు ఖర్చు చేశామని.. అయిన సరైన ఫలితం ఇవ్వలేదని అందుకే కుక్కలను చంపేందుకు మాకు అనుమతి కల్పించండి అంటూ జీహెచ్ఎంసీ హైకోర్టులో అఫిడవేట్ దాఖలు చేసింది. కుక్కల నియంత్రణకు గడిచిన ఐదు సంవత్సరాలలో జీహెచ్ఎంసీ సుమారు 40 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, ప్రజలకు అవగాహన కోసం ఇతర కార్యక్రమాలకు ఖర్చు పెట్టారు. సంస్థ నేరుగా 29.66 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, యానిమల్ వెల్ఫేర్ సంస్థల ద్వారా గత ఐదేళ్లలో మరో 9.21 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు జిల్లాల్లో ప్రతీ యేటా 35 వేల నుంచి 40 వేలకు పైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో నమోదైన కుక్క కాటు కేసుల్లో 30 శాతం గ్రేటర్‌లోని ఉన్నాయి. క్రూరంగా ప్రవర్తించే కుక్కలను చంపేందుకు అనుమతించాలంటూ హైకోర్టుకు జీహెచ్ఎంసీ విన్నవించింది. ఈ మేరకు న్యాయస్థానానికి సమర్పించిన అదనపు అఫిడవిట్లో వీధి కుక్కల నియంత్రణకు నిరంతరాయంగా పని చేస్తున్నాం. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా కానీ కుక్క కాట్లతో ప్రాణాలు పోతున్నాయని కోర్టుకు వివరించింది. ప్రజలపై దాడి చేసే, వారి ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ప్రమాదకర కుక్కల విషయంలో యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా సిఫారసులు, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ యాక్ట్ 1960 ప్రకారం ముందుకెళ్లాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. స్టెరిలైజేషన్ చేసినా కొన్ని కుక్కలు ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నాయని, వాటి ప్రవర్తన మారేలా శిక్షణ ఇచ్చి అప్పటికీ మారకపోతే 1960 చట్టంలోని 11(3) బి,(2), 11(3)సీ సెక్షన్ల ప్రకారం వెటర్నరీ వైద్యుడి పర్యవేక్షణలో కుక్కలను చంపే(డిస్ట్రాయ్) వెసులుబాటు ఉందని హైకోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో జీహెచ్ఎంసీ పేర్కొంది.
కుక్కలు దాడులు చేస్తుండడంతో పెద్దవారితో పాటు పిల్లలు కూడా చనిపోతున్నారు. కొందరు తీవ్రంగా గాయపడుతున్నారు. వారిని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. మరో ప్రత్యామ్నాయం లేకనే ఎతునేషియాకు అనుమతించాలని కోరుతున్నామని అఫిడవిట్లో జీహెచ్ఎంసీ వివరించింది. నిబంధనల ప్రకారం నడుచుకుంటామని, చట్టంలో సూచించిన ప్రకారమే ఈ ప్రక్రియ చేపడతామని కమిషనర్ పేరిట అఫిడవిట్‌లో పొందుపర్చారు. అంబర్‌పేటలో నాలుగేళ్ల చిన్నారి కుక్కల దాడిలో మృతి చెందిన కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. అఫిడవిట్‌లో వెల్లడించిన అంశాలు, కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో జీహెచ్ఎంసీ మరిన్ని అంశాలను ప్రస్తావించింది. వీధి కుక్కల నియంత్రణకు నిరంతరాయంగా పనిచేస్తున్నాం. యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ), యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేస్తున్నాం. ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాం. జీహెచ్ఎంసీలోని వెటర్నరీ విభాగంతో పాటు ఎన్జీఓలనూ ఈ ప్రక్రియలో భాగస్వాములను చేశాం. ఐదు ఏబీసీ కేంద్రాలు, 18 మంది ప్రైవేట్ వెటర్నరీ వైద్యులు, 22 మంది పారా వెటర్నేరియన్లు, ఆరుగురు షెల్టర్ మెనేజర్లు, 362 మంది కుక్కలు పట్టుకునే సిబ్బంది పని చేస్తున్నారు. 49 కుక్కలు పట్టుకునే వాహనాలు అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు కేసుల ఆధారంగా హాట్ స్పాట్లు గుర్తించి ఆ ఏరియాల్లో స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేస్తున్నాం. పాఠశాలలు, మూసీ తీర ప్రాంతాలు, ఆర్మీ ఏరియాలు, ఆట స్థలాలున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. కుక్కల దాడి నుంచి కాపాడుకునేందుకు ఏం చేయాలనే దానిపై 1,887 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 3,97,015 మంది విద్యార్థులకు అవగాహన కల్పించాం. గ్రేటర్ లో 80 శాతానికిపైగా కుక్కలకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ జరిగింది. అయినా వాటి నియంత్రణ ఆగడం లేదని హై కోర్టుకు విన్నవించిన జీహెచ్ఎంసీ.
రేబిస్ సోకిన, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన, స్టెరిలైజేషన్ చేసిన కుక్కలు క్రూరంగా ప్రవర్తిస్తున్నాయి. వ్యక్తులపై దాడి చేయడంతోపాటు రోడ్డు ప్రమాదాలకూ కారణమవుతున్నాయి. ప్రపంచంలో నమోదవుతోన్న రేబిస్ మరణాల్లో 36 శాతం మన దేశంలోనే అని పేర్కొన్నారు. యూకే, యూఎస్ఏ వంటి ఇతర దేశాల్లో అమలులో ఉన్న చట్టాలనూ జీహెచ్ఎంసీ కోర్టు ముందుంచింది. యూకే పర్యావరణ పరిరక్షణ చట్టం 1990 ప్రకారం పబ్లిక్ స్థలాల్లో కనిపించిన వీధి కుక్కలను నిర్బంధిస్తారు. వాటి మెడపట్టిపై ఉండే వివరాల ఆధారంగా సంబంధించిన అధికారి లేఖ రాస్తాడు. 'మీ కుక్కను నిర్బంధించాం. ఫలాన చోట ఉంచాం. నోటీసు అందిన ఏడు పని దినాల్లో వచ్చి తీసుకెళ్లండి' అని సూచిస్తారు. కుక్కను పట్టుకునేందుకు, దాని తిండి ఖర్చుతోపాటు, ఇతరత్రా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలో స్పందించకపోతే ఆ కుక్కలను ఇతరులకు విక్రయిస్తారు. మనుషుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారినప్పుడు చట్టప్రకారం ఎతునేషియాకు అనుమతిస్తున్నారని పేర్కొన్నారు. మన దేశంలోనూ కేంద్ర, రాష్ట్ర చట్టాల ప్రకారం ఎతునేషియా ద్వారా ప్రమాదకర/ప్రాణాంతక కుక్కలను చంపడం చట్టబద్ధమే అని పేర్కొన్నారు. ఎతునేషియా అంటే.. శస్త్రచికిత్సల సమయంలో మత్తు కోసం ఇచ్చే సోడియం పెంటోబార్బిటల్ ఇంజక్షన్‌ను ఎక్కువ మోతాదులో ఇవ్వడం, దీంతో కోమాలోకి వెళ్లిన కుక్కలు అనంతరం చనిపోతాయి. శారీరకంగా హింసించకుండా ఈ విధానం వినియోగిస్తారు.

# నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల సమస్యలను తీరుస్తూ నాయకుడు గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గచ్చిబౌలి కార్పొరేటర్ వాసెపల్లి గంగాధర్ రెడ్డి



**సత్యమేవ జయతే - హైదరాబాద్** హైదరాబాద్ : గత నాలుగు సంవత్సరాలు కార్పొరేటర్ పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు హనుమంతు నాయక్ ఉపాధ్యక్షులు రాయుడు, ఉరడి మలకయ్య, బి రాంబాబు నాయక్, మరియు నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మహిళా సోదరిమణులు యువజన నాయకులు కాలనీ పెద్దలు పెద్ద ఎత్తున తరలి వెల్లి శుభాకాంక్షలు తెలియజేశారు గచ్చిబౌలి డివిజన్ ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గంగాధర్ రెడ్డి గారికి గచ్చిబౌలి డివిజన్ కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున తల్లి వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు



## ప్రవేటు హాస్పటల్ చర్యలు తీసుకోవాలి

**సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్..** మల్టీ స్పెషాలిటీ పేరుతో కొనసాగుతున్న పరిగి సాధన, వికారాబాద్ మెడిక్యూర్ మరియు కనీస సౌకర్యాలు లేని హాస్పిటల్స్ పైన చర్యలు తీసుకోవాలని %ణవీనూ% కు వినతిపత్రం ఇచ్చిన %ూ×ఖమీూ% జిల్లా మహేందర్ అన్నారు

# లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు పట్టుబడ్డ దారుర్ ఎస్సై వేణుగోపాల్ గౌడ్ .



**సత్యమే జయతే వికారాబాద్ టౌన్** .... దారుర్ మండలం నాగ నాగసముద్రం గ్రామానికి చెందిన ఓ కేసు నుండి తప్పించేందుకు 70 వేల రూపాయలు డిమాండ్ చేశారు. అయితే మంగళవారం సాయంత్రం 30,000 వేల రూపాయలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దారుర్ ఎస్సై వేణుగోపాల్ గౌడ్ చిక్కాడు

## నూతన సేవలను సద్వినియోగం చేసుకోండి ఈడీఎం ఉదయ్ కుమార్



**సత్యమేవజయతే నారాయణఖేడ్** మీసేవలో నూతన రేషన్ కార్డు,యూడీఐడీ వచ్చిన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఈడీఎం ఉదయ్ కుమార్ అన్నారు.మంగళవారం ఈడీఎం మేనేజర్ ప్రదీప్ తో కలసి నారాయణఖేడ్ పట్టణంలోని మీసేవ కేంద్రాలను ఆకస్మింగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మీసేవ నిర్వాహకులు వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని,నిర్ణీత ధర తీసుకోవాలన్నారు.వేసవి కాలం రానందున వినియోగదారుల కోసం మంచినీటి సౌకర్యం కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా వచ్చిన రేషన్ కార్డు, యూడీఐడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




వికారాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి కార్యనిర్వాహక అధ్యక్షులుగా పడిగల్ల అశోక్: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్. సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్ ఈరోజు వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లి లోని భవన్ (జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం) లో నిర్వహించిన వికారాబాద్ మండల బిఆర్ఎస్ నాయకుల బిఆర్ఎస్ కార్యకర్తల అంతర్గత సమావేశానికి హాజరైన వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమావేశంలో భాగంగా వికారాబాద్ మండల గ్రామాలబిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు మహిపాల్ రెడ్డిని వికారాబాద్ మండలబిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గా మరియు పడిగల్ల అశోక్ ని వికారాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు గా నియమించారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ మాజీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ గారు, మాజీ ఎంపీపీ చంద్రకళ కమాల్ రెడ్డి గారు, మాజీ సర్పంచ్ ల సంగం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి గారు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజి %వీూజ% లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ లో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌజ్ కు భూమి భూమి పూజ చేసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.



**సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్.....** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా వికారాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ భూమి పూజ చేశారు వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ మరియు ఆర్డిఓ ఎమ్మార్వో . వికారాబాద్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి . మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ పిల్లారా%శీ% మల్లేశం సామ సామ రామచంద్ర రెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు కష్టంతో కాదు ఇష్టంతో చదవాలి

## రాబోయే పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలి

## పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్




**సత్యమేవ జయతే పుల్కల్ ప్రతినిధి** విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి రాబోయే పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని పుల్కాల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ అన్నారు మంగళవారం నాడు ఇంటర్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆయన తగు సూచనలు సలహాలు ఇచ్చారు అలాగే సైబర్ క్రైమ్. పోక్సో. రోడ్డు భద్రత ఇతర చట్టాలపై వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు అంతేకాకుండా విద్యుత్ తో పాటు క్రీడల్లో సైతం ప్రతిభ కనబరచాలన్నారు ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా ఉత్తీర్ణత సాధించాలన్నారు భవిష్యత్తులో ప్రతి విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగాలను పొందాలన్నారు అప్పుడే తమ తల్లిదండ్రులు సంతోషిస్తారన్నారు వారి సంతోషాన్ని వమ్ము చేయకుండా చదువుపై దృష్టి సారించి పరీక్షల్లో తమ ప్రతిభను కనబరిచి మంచి మార్కులతో ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత సాధించాలన్నారు ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి & కార్యనిర్వాహక అధ్యక్షులుగా పడిగళ్ల అశోక్: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్.



**సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్ :** ఈరోజు వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లి లోని బి ఆర్ ఎస్ భవన్ (జిల్లా బి.ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం) లో నిర్వహించిన వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల & కార్యకర్తల అంతర్గత సమావేశానికి హాజరైన వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గారు. సమావేశంలో భాగంగా వికారాబాద్ మండల & గ్రామాల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు మహిపాల్ రెడ్డి గారిని వికారాబాద్ మండల బి.ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులుగా మరియు పడిగళ్ల అశోక్ గారిని వికారాబాద్ మండల బి.ఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ గారు, మాజీ బి సి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ గారు, మాజీ ఎంపీపీ చంద్రకళ కమాల్ రెడ్డి గారు, మాజీ సర్పంచ్ ల సంగం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి గారు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజి ఎంపీటీసీలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఉపఎన్నికలు ఖాయం



**సత్యమేవ జయతే హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టారు. ఈ నేపథ్యంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీ వీడి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జోస్యం చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికల్లో కడియం శ్రీహరి ఓట మి తప్పదని ఆయన స్పష్టం చేశారు. తాడికొండ రాజయ్య మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తారన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చింతమడకలోని ఫామ్ హౌస్‌లో సీఎం కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్యతో పాటు ఆయన అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గులాబీ కండువా కప్పి.. వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్ మాట్లా డుతూ.. పార్టీ ఫిరాయింపులపై కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉపఎన్నికలు ఖాయని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో రాజయ్యతోపాటు చేరిన వారిలో కీర్తి వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉద్యోగులపై కలెక్టర్ నిఘా.. వేళలు పాటించని వారిపై కొరడా




**సత్యమేవ జయతే హైదరాబాద్ :** ఇటీవల ఐసీడీఎస్ ఉద్యోగుల వ్యవహారంతో సీరియస్ హైదరాబాద్ సిటీ: కలెక్టరేట్‌లో పనిస్తున్న ఉద్యోగులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక నిఘా పెట్టారు. వేళలు పాటించకుండా కార్యాలయాలకు రావడం, పనివేళలు ముగియకముందే ఇంటిబాట పడుతున్న వారిపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. ఎవరు ఎప్పుడొస్తున్నారు.. ఎంతసేపు సీట్లలో కూర్చుని పైళ్లను పరిష్కరిస్తున్నారు.. అనే వివరాలను సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ, ఆ పక్కనే ఉన్న బాలరక్షక్ భవన్‌లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు రిజిస్టర్‌లో సంతకం చేసి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మధ్యాహ్నంలోపే ఇటీవల ఆఫీస్ నుంచి బయటకు వెళ్లారు. ఈ విషయంపై పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన కలెక్టర్ స్త్రీ, శిశు సంక్షేమశాఖలోని 14 మందిపై చర్యలు తీసుకున్నారు. వారికి సంబంధించిన ఒకరోజు వేతనం నిలుపుదలతోపాటు సర్వీస్ కౌంట్‌ను చేయవద్దని ఎఫ్ఆర్–18 ప్రకారం ఉత్తర్వులు జారీచేశారు.

**రోజూ ప్రత్యేక తనిఖీలు..** ప్రతి ఉద్యోగి వేళలు పాటించాలని, సమయం ముగియకముందే ఆఫీస్‌ను విడిచి వెళ్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు పెడచెవిన పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు తనిఖీలకు కలెక్టర్ సిద్ధమవుతున్నారు. అలాగే, త్వరలో అన్నిశాఖల ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు.

## వికారాబాద్ మండల BRS పార్టీ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి & కార్యనిర్వాహక అధ్యక్షులుగా పడిగళ్ల అశోక్: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్.

**సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్ :** ఈరోజు వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలోని బి ఆర్ ఎస్ భవన్ (జిల్లా బి.ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం)లో నిర్వహించిన వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల & కార్యకర్తల అంతర్గత సమావేశానికి హాజరైన వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గారు.సమావేశంలో భాగంగా వికారాబాద్ మండల & గ్రామాల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు మహిపాల్ రెడ్డి గారిని వికారాబాద్ మండల బి.ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గా మరియు పడిగళ్ల అశోక్ గారిని వికారాబాద్ మండల బి.ఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు గా నియమించారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ గారు, మాజీ BC కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ గారు, మాజీ ఎంపీపీ చంద్రకళ కమాల్ రెడ్డి గారు, మాజీ సర్పంచ్ ల సంగం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి గారు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజి MPTCలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహా.. ఏం ఐడియా.. సొంత కార్లు.. అద్దె వాహనాలుగా..



**సత్యమేవ జయతే హైదరాబాద్ :** జీహెచ్ఎంసీలో కొందరు అధికారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రేటు కట్టి పౌర సేవలు.. బిల్లుల రూపకల్పన నుంచి చెల్లింపుల వరకు పర్సంటేజీలు.. అనుమతులు, నివాసయోగ్య పత్రాల జారీకి తీసుకునే అమ్యామ్యాలు చాలవన్నట్టు.. బల్దియా ఖజానాకు కన్నం వేస్తున్నారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపి దోచుకుంటున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో వివరాలను పరిశీలించిన రవాణా విభాగం అధికారులు 26మందికి నోటీసులు జారీ చేశారు.

**జీహెచ్ఎంసీలో 26 మంది అధికారులకు నోటీసులు**

**ఈ తరహా వాహనాలపై ఆరా..**

ఏ వాహనాలు వినియోగిస్తున్నారు..? అవి సొంతమా..? ట్యాక్సీ ప్లేట్ వాహనాలా..? వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఇందులో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా, యూసీడీ, పారిశుధ్య నిర్వహణ తదితర విభాగాల అధికారులున్నట్టు సమాచారం. జీహెచ్ఎంసీ డ్రైవర్ కమ్ ఓనర్ (డీఓసీ) పథకంలో భాగంగా గతంలో 400లకుపైగా కార్లను బ్యాంకు రుణాల ద్వారా నిరుద్యోగ యువతకు అందించింది. కొందరు అధికారులు డీఓసీ డ్రైవర్లను వేధించి.. తమ వద్ద పని చేయకుండా చేశారు. అనంతరం సొంత కార్లను అద్దె వాహనాలుగా వినియోగిస్తూ వచ్చారు. జీహెచ్ఎంసీలో దాదాపు 800 మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఇందులో సంస్థ సొంత, అద్దె వాహనాలున్నాయి. ప్రాథమిక పరిశీలనలో గుర్తించిన 26 మందికి నోటీసులు ఇవ్వగా.. కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో సొంత కార్లను అద్దె వాహనాలుగా ఎంత మంది వినియోగిస్తున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు.

సొంత నంబర్ ప్లేట్ వాహనాలు ఎంత మంది వాడుతున్నారు..? వాటిలో అద్దె ఎన్ని వాహనాలకు చెల్లిస్తున్నారన్నది గుర్తిస్తే అక్రమాలు బయటపడుతాయని ఓ అధికారి తెలిపారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారులు 80 మందికిపైగా ఉంటారని రవాణా విభాగం వర్గాలు చెబుతున్నాయి. వీరికి నెలకు రూ.27.20 లక్షల చొప్పున యేటా రూ.3.26 కోట్లు చెల్లిస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన మద్యం ధరలు.. ఇవిగో వివరాలు

**సత్యమేవ జయతే తెలంగాణ :** ఏపీ, తెలంగాణ మందుబాబులకు భారీ షాక్ తగిలింది. మద్యం ధరలు పెంచుతూ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. రూ.99కు అమ్మే బ్రాండ్ , బీర్ మినహా మిగిలిన అన్ని కేటగిరీల మద్యం ధరలు సవరిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటు తెలంగాణలో బీరు ధరలు పెరిగాయి. రాష్ట్రంలో బీరు ధరలు 15 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్వర్వులు వచ్చాయి.రాష్ట్రంలో బీర్ల ధరలు పెరిగాయి. ప్రాథమిక ధర (బేసిక్ ప్రైస్)ను పెంచుతూ ఎక్సైజ్ శాఖ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అన్ని బ్రాండ్ల బీర్ల గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ)లో సుమారు 15% పెరుగుదల కనిపించనుంది.



**ఎమ్మార్పీ పెంపు – లైట్, స్ట్రాంగ్ బీర్ల కొత్త ధరలు..** విశ్వసనీయ సమాచారం ప్రకారం, లైట్ బీరు ధర రూ.150 నుంచి రూ.180కి, స్ట్రాంగ్ బీరు ధర రూ.160 నుంచి రూ.190కి పెరిగే అవకాశము ంది. రౌండింగ్ ఆఫ్ విధానాన్ని అనుసరించే ప్రభుత్వ ధోరణి కారణంగా ఖచ్చితమైన పెంపు వివరాలు నేడు స్పష్టతకు వస్తాయి.

**కొత్త స్టాక్‌కు కొత్త ధరలు– పాత స్టాక్‌కు మార్పుల్లేవు..**

నేటి నుంచి వైన్ షాపులు, బార్ రెస్టారెంట్లకు డిపోల్లో చేరే కొత్త స్టాక్ కొత్త ధరలకు విక్రయించబడుతుంది.

అయితే, సోమవారం నాటికి డిపోల నుంచి పంపిణీ చేసిన బీర్లను పాత రేటుకే అమ్మాల్సి ఉంటుంది.

**బీర్ల కంపెనీల డిమాండ్‌కు ప్రభుత్వం స్పందన..**

బేసిక్ ధర పెంపు, బకాయిల చెల్లింపుల విషయంలో గతంలో బీర్ల తయారీ కంపెనీలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ముఖ్యంగా కింగ్‌ఫిషర్ బ్రాండ్ కొంతకాలం సరఫరా నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వం ధరల నిర్ణాయక కమిటీ సిఫారసుల మేరకు ఎట్టకేలకు ప్రాథమిక ధర పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

**మద్యం వినియోగదారులకు కొత్త భారం..**

ఈ పెంపుతో మద్యం వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కొత్త ధరలు మంగళవారం నుంచి అమల్లోకి రానుండగా, వినియోగదారులు ముందు రోజుల్లో బీర్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశముంది.

**ఏపీలో సైతం పెరిగిన మద్యం ధరలు...**

%ఇక ఏపీ సర్కార్ సైతం మద్యం ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రూ.99 లిక్కర్, బీరు మినహా అన్ని కేటగిరీల్లో రేట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా లిక్కర్ రేటు బాటిల్‌పై రూ.10 మాత్రమే పెరిగిందని ఏపీ ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ చెప్పారు. బ్రాండ్, సైజ్‌తో సంబంధం లేకుండా బాటిల్‌పై రూ.10 మాత్రమే పెంచినట్లు వెల్లడించారు. రూ.99 లిక్కర్, బీరు ధరల్లో ఎలాంటి పెరుగుదల లేదన్నారు. ధరలను మద్యం షాపులన్నీ డిస్ ప్లే చేయాలని సూచించారు.

# అపూర్వ సమ్మేళనం.. 4 దశాబ్దాల తర్వాత గ్రామస్థులంతా కలిసి భోజనాలు



**సత్యమేవ జయతే, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో తోయగూడ గ్రామస్థులు బతుకు దెరువు కోసం.. వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇలా ఎక్కడెక్కడో నివాసం ఉన్న సుమారు 500 మందికిపైగా 40 ఏళ్ల తర్వాత ఖాళీ చేసిన గ్రామ శివారులో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు.తెలంగాణ రాష్ట్రం , ఆదిలాబాద్ జిల్లా లోని బేల మండలం, తోయగూడ గ్రామస్థులు మధురానుభూతులను కైవసం చేసుకున్నారు. జైనథ్ మండలం సాత్నాల వద్ద 1984లో ప్రభుత్వం ప్రాజెక్టును నిర్మించింది. ప్రాజెక్టు ముంపులో భాగంగా గ్రామాన్ని ఖాళీ చేసిన తోయగూడ వాసులు బతుకు దెరువు కోసం.. వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. మంచి భూములు, ఇళ్లను కోల్పోయి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఎక్కడకు వెళ్లినా పుట్టిన గ్రామం తాలుకూ జ్ఞాపకాలు వారి మనసులో నుంచి వీడిపోలేదు. ఎక్కడెక్కడో నివాసం ఉన్న సుమారు 500 మందికిపైగా 40 ఏళ్ల తర్వాత ఖాళీ చేసిన గ్రామ శివారులో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.దాహం తీర్చిన బావి, చదువుకున్న బడి ఆనవాళ్లను వారి పిల్లలకు చూపిస్తూ మురిసిపోయారు. గత జ్ఞాపకాలను పదిలపరుచుకునేలా చరవాణుల్లో స్వీయ చిత్రాలు తీసుకున్నారు. చిన్నా, పెద్ద తేడా మరిచి ఆడిపాడుతూ ఉత్సాహంగా గడిపారు. దాదాపు 4 దశాబ్దాల తర్వాత గ్రామస్థులంత కలిసి భోజనాలు చేసి ఆటపాటలతో ఆత్మీయతను పంచుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు.అలాగే కోయిలకొండ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పాఠశాలలో చదువుకొన్న విద్యార్థులు పాఠశాలు చెప్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సత్కరించారు. 25 సంవత్సరాల తరువాత వివిధ హెూదాలో స్థిరపడిన విధ్యార్థులు ఆనాటి రోజులు గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం పాఠశాలకు ఫర్నీచర్ అందించారు. ఆపదలో ఉన్న విద్యార్థులు 17 మందికి ఆర్థిక సాయం అందించారు.మరోవైపు ఆదిలాబాద్ జిల్లా, చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 1983–1984లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.

ఈ అపూర్వ సమ్మేళనంలో 40 సంవత్సరాల తర్వాత ఒకే వేదిక పైకి చేరిన ఉపాధ్యాయులు,విద్యార్థులు తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

# లోయలో పడిన బస్సు.. 55 మంది ప్రయాణికులు మృతి



**సత్యమేవ జయతే గ్వాటెమాలా :** గ్వాటెమాలా – ఓ ప్రయాణికుల బస్సు అదుపుతప్పి వంతెనపైనుంచి లోయలో పడిపోయింది. దీంతో 50 మందికిపైగా మరణించగా, పలువురు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నారు. ఓ ప్రయాణికుల బస్సు ఆకస్మాత్తుగా 35 మీటర్ల ఎత్తు నుంచి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 55 మంది మరణించారు. గ్వాటెమాల రాజధాని శివార్లలో సోమవారం ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు వంతెనపై నుంచి జారిపడి మురుగు నీటి ప్రవాహం లోయలో పడిపోయింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 53 మృతదేహాలను వెలికితీశారు. మరొక ఇద్దరు శాన్ జువాన్ డి డియోస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు మృతిచెందారని అధికారులు తెలిపారు.

**బాధితుల్లో పిల్లలు కూడా..** ప్రమాదం జరిగిన ప్రాంతంలో మరికొందరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారని, వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని అధికారులు వివరాలను వెల్లడించారు. అగ్నిమాపక సిబ్బంది ఇంకా బస్సు నుంచి గాయపడిన వారిని బయటకు తీసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బస్సు రాజధానికి ఈశాన్యంగా ఉన్న ప్రోగ్రెసో నుంచి వచ్చిందని, బాధితుల్లో పిల్లలు కూడా ఉన్నారని అగ్నిమాపక అధికారి ఆస్కార్ సాంచెజ్ పేర్కొన్నారు. బస్సు ప్రోగ్రెసో అనే ప్రాంతం నుంచి బయలుదేరి గ్వాటెమాలా నగరానికి వెళ్లిపోతున్న క్రమంలో ఈ ఘోర ప్రమాదానికి గురైంది.

**దర్యాప్తు..** ప్రోగ్రెసో రాజధాని గ్వాటెమాలా నగరానికి ఈశాన్యంగా కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం. ఈ బస్సులో చాలా మంది ప్రయాణికులు స్థానిక ప్రజలుగా చెబుతున్నారు. గ్వాటెమాలా అధ్యక్షుడు బెర్నార్డో అరేవాలో ఈ ఘోర ప్రమాదం గురించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన తక్షణం బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలపడంతో పాటు, జాతీయ సంతాప దినాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదానికి బాధ్యులైనవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## బెస్ట్ ప్రజెంటేషన్ స్పీకర్‌గా అవార్డు పొందిన మధురా చౌహాన్



**సత్యమేవ జయతే :** గంపా నాగేశ్వర్ రావు స్థాపించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్ బంధం రావూరి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ట్రైన్ ద ట్రైనర్ వర్క్ షాప్ 189వ బ్యాచ్ ట్రైనింగ్ హైదరాబాద్ లోని మినర్వా గ్రాండ్ స్టార్ హెూటల్లో ఫిబ్రవరి 8, 9, రెండు రోజుల పాటు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ స్కిల్స్ నేర్పించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ పట్టణానికి చెందిన మధురా చౌహాన్ ట్రైనింగ్లో పాల్గొన్న 37 మందిలో బెస్ట్ ప్రజెంటేషన్ స్పీకర్ గా సెలెక్ట్ కావడంతో ఇంపాక్ట్ నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా మధుర చౌహాన్ మాట్లాడుతూ ఇంపాక్ట్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో స్టూడెంట్స్ ను మోటివేషన్ చేస్తానన్నారు.

# పసి పాపకు పేరుపెట్టిన మాజీ మంత్రి కేటీఆర్.. ఏం పేరు పెట్టారో తెలుసా?



**సత్యమేవ జయతే - వికారాబాద్** వికారాబాద్ : ఆ పోరాటం జరుగుతున్న సమయంలో పార్టీ ఇచ్చిన మద్దతుకు జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాదు రెండు మూడుసార్లు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన జ్యోతి తాను ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నట్లుగా చెప్పారు. దీంతో జ్యోతి ఆసుపత్రికి వెళ్లేందుకు.. డెలివరీ అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ తరుపున అండగా నిలిచారు. ఓ పసిపాపకు నామకరణం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు. కొద్ది రోజుల క్రితం జరిగిన లగచర్ల పోరాటం అందరికీ తెలిసిందే..! వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మసిటీకి భూములు ఇవ్వబోము అంటూ అక్కడి గిరిజన రైతులు ప్రభుత్వ అధికారులపై పోరాటం చేశారు. గ్రామ సభకు వచ్చిన జిల్లా కలెక్టర్‌పై తిరగబడ్డారు. ప్రభుత్వ వాహనాలు ధ్వంసం చేసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అదొక సంచలనంగా మారింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న రేవంత్ రెడ్డి కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనకు బాధ్యులైన 32 మంది లగచర్ల రైతులను జైలుకు పంపించింది ప్రభుత్వం. అయితే ఈ మొత్తం లగచర్ల ఉద్యమంలో హైలెట్ గా నిలిచింది జ్యోతి అనే మహిళ. గర్భవతిగా ఉన్న జ్యోతి తన భర్తను ఎలాంటి సంబంధం లేకుండా జైలుకు పంపారంటూ.. ఎస్సీ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల సంఘం వరకు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఢిల్లీ వరకు వెళ్లి నేషనల్ హ్యూమన్ రైట్స్ ముందు తన గోడు వినిపించింది. మీడియాలో కూడా లగచర్ల పోరాటం పై మాట్లాడుతూ గిరిజనుల గూడును వినిపించిన జ్యోతి అందరికీ గుర్తుండిపోయింది. అప్పుడు గర్భవతిగా ఉన్న జ్యోతి రెండు వారాల క్రితం ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే మొదటి నుంచి లగచర్ల పోరాటానికి మద్దతుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఫిబ్రవరి 10, సోమవారం అదే ప్రాంతంలో రైతు ధర్నా నిర్వహించింది. అక్కడికి మాజీ మంత్రి కేటీఆర్ కూడా వెళ్లారు. లగచర్ల ప్రజలు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడికి వచ్చిన జ్యోతి తన కూతురికి నామకరణం చేయమని కేటీఆర్ ని అడిగింది. చాలా సంతోషంగా ఆ పాపను చేతుల్లోకి తీసుకున్న కేటీఆర్ ఆ అమ్మాయికి భూమి నాయక్ అని పేరు పెట్టారు. భూమికోసం మీరు చేసిన పోరాటానికి గుర్తుగా ఈ పాపకు భూమి నాయక్ అని పేరు పెడుతున్నానంటూ చెప్పారు.ఆ పోరాటం జరుగుతున్న సమయంలో పార్టీ ఇచ్చిన మద్దతుకు జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాదు రెండు మూడుసార్లు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన జ్యోతి తాను ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నట్లుగా చెప్పారు. దీంతో జ్యోతి ఆసుపత్రికి వెళ్లేందుకు.. డెలివరీ అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని తాము చూసుకుంటామంటూ హామీ ఇచ్చి అండగా నిలిచారు కేటీఆర్.

# వీరరాఘవ రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలు..




**సత్యమేవ జయతే - రంగారెడ్డి** రంగారెడ్డి : దేవుడి పేరు చెప్పి దందాలు చేసే బ్యాచ్‌లు ఎక్కడపడితే అక్కడే కనిపిస్తున్నాయ్.. ఇలాంటి వాళ్లలో వీరరాఘవరెడ్డి తీరు వేరే లెవెల్..! ఇతని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు సంచలన విషయాలను బయటపెట్టారు. దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డితో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. మ్యూజిక్ టీచర్‌గా కెరీర్ మొదలుపెట్టిన వీరరాఘవ రెడ్డి ఒక పద్ధతి ప్రకారం తన ప్లాన్ అమలు చేసేందుకు ప్రైవేట్ ఆర్మీని రెడీ చేసుకున్నాడు.. కోసలేంద్ర ట్రస్ట్ పేరుతో రామరాజ్యం ఆర్మీ ఏర్పాటు చేసి మొదటి స్లాట్‌లో 5 వేల మందిని రిక్రూట్ చేసుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్నాడు. 20 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవాళ్లను రిక్రూట్ చేసుకుంటున్నాడు. కనీసం 5 కిలోమీటర్లు నడిచే శక్తి ఉండి తాను చెప్పించి చెప్పినట్టు చెస్తే చాలు.. అలాంటి వాళ్లకు జీతాలిచ్చి తన వెంట తిప్పుకుంటున్నాడు. రామరాజ్యంలో చేరిన వారికి ప్రతి నెల 20 వేల జీతంతో పాటు వసతి కల్పిస్తామని హామీ ఇస్తున్నాడు ఈ వీర రాఘవరెడ్డి. 350 రూపాయల రుసుముతో గత ఏడాది సెప్టెంబర్ 1నుంచి డిసెంబర్ 31వరకు కొన్ని రిజిస్ట్రేషన్లు కూడా చేశారు.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకు రామరాజ్యం ఆర్మీకి 1 లక్ష 20వేల 599 రూపాయలు విరాళంగా వచ్చాయి. ఐతే.. అంతకు కొన్ని రెట్లు మొత్తం దందాలతో లాక్కున్నట్టుగా అనుమానిస్తున్నారు. అందుకు పూర్తి ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు పోలీసులు. సిఆర్పిసి సెక్షన్ 340ని న్యాయ వ్యవస్థలోని కొందరు నిర్లక్ష్యం చేశారని.. దీని ద్వారా ఆలయాలకు చెందిన లక్షల ఎకరాల భూములు కబ్జాకు గురవుతున్నాయని రామరాజ్యం ఆర్మీ ఏర్పాటు చేసిన వీర రాఘవరెడ్డి వాదనగా ఉంది. తానేదో హిందూధర్మం ఉద్ధరణకు పనిచేస్తున్నట్టు బిల్డప్ ఇస్తూ.. కొన్ని ఆలయాలకు వెళ్లి అక్కడి అర్చకుల్ని బెదిరించడం వాళ్ల నుంచి డబ్బులు లాక్కునే ప్లాన్‌లు వేయడం రాఘవరెడ్డికి పరిపాటిగా మారింది.- చిలుకూరు ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్‌పై దాడితో ఒక్కసారిగా వీర రాఘవరెడ్డి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో దాడి చేసిన బ్యాచ్‌ను గుర్తించి ఒక్కొక్కరినీ అరెస్టు చేస్తున్నారు.

చిలుకూరు ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డితో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి తరలించారు. వీర రాఘవరెడ్డిని 5 రోజులు కస్టడీ కోరుతూ ఉప్పరపల్లి కోర్టులో మొయినాబాద్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దాడి చేసిన మొత్తం 25 మందిని గుర్తించారు.. వాళ్ల కోసం ఏపీలో తెలంగాణ పోలీసులు గాలిస్తున్నారు. రంగరాజన్‌పై దాడి కేసులో ఎ1 వీర రాఘవరెడ్డి ఉన్నాడు.. ఇతను మ్యూజిక్ టీచర్.. ఎ2 సాయన్న.. ఇతను ఓ మెడికల్ షాప్ ఓనర్. ఎ3గా ఉన్న భూక్య గోపాలరావు డైలీ లేబర్‌గా చెప్తున్నారు.. ఈ కేసులో ఎ4గా భూక్య శ్రీను ఉన్నాడు. అతను టైలర్.. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

## మన వ్యక్తిత్వం, మన ఆలోచనలు మెరుగు పడాలంటే దేవాలయ సందర్శన అవసరం: చిన్నజీయర్ స్వామి




**సత్యమేవ జయతే - హైదరాబాద్** హైదరాబాద్ : హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లో సమతాకుంభ్ 2025 వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి చిన్నజీయర్ స్వామి పాల్గొన్నారు. చిన్నారుల దగ్గరి నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు అందరినీ పలకరించారు చిన్నజీయర్ స్వామి. వివిధ పాఠశాలల విద్యార్థులతో రామాయణ సూపర్ మెమొరీ టెస్ట్ నిర్వహించారు. మానవాళికి మానవతా సందేశాన్నిచ్చిన దివ్యమూర్తి..! భారతీయ తత్త్వ చింతనను విశ్వవ్యాప్తం చేసిన సమతా స్ఫూర్తి! అపర రామానుజులుగా..ప్రపంచానికి సమతను, మమతను పంచుతున్న అభ్యుదయ ఆధ్యాత్మికమూర్తి.. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి. మానవాళికి ఐక్యతా సందేశాన్ని అందించిన ఆ మానవతామూర్తి జీవితం ఆదర్శప్రాయం! రామానుజ మార్గంలో.. ఆ జగద్గురువులు అందిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం! సమతా స్ఫూర్తి సందేశాన్ని ప్రపంచానికి అందించాలన్న సంకల్పంతో భగవద్రామానుజుల మహా విగ్రహ రూపకల్పన చేశారు. 216 అడుగుల సమతామూర్తి దివ్య విగ్రహం! ఆధ్యాత్మికంగానే కాదు..స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎన్నో జీవితాలు వెలుగులు నింపాయి. పేదలకు విద్య, వైద్య సౌకర్యాలతోబాటు.. పర్యావరణ పరిరక్షణకు స్వామీజీ చేస్తున్న కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్‌లో 108 దివ్యదేశాలను నిర్మించి ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలోనే సమతాకుంభ్ 2025, 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం (ఫిబ్రవరి 11) మధ్యాహ్నం ఆలయాలు నాడు-నేడు అనే అంశంపై ఇష్టాగోష్టి నిర్వహించారు. శ్రీరామానుజుల వారి పాత్రపై విద్యార్థులతో ముఖాముఖి జరిగింది. హైదరాబాద్ మహానగరంలోని 15 విద్య సంస్థలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామానుజుల వారిపై క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. అలాగే రామాయణం గురించి త్రిదండి చిన్నజీయర్ స్వామి వారు స్వయంగా అక్కడికి వచ్చిన చిన్నారుల దగ్గరి నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు అందరినీ పలకరించారు. ప్రజ్ఞ విద్యార్థులతో రామాయణ సూపర్ మెమొరీ టెస్ట్ నిర్వహించారు. దేవాలయాలు మన జీవితంలో ఎంతో ముఖ్యమైన స్థానంలో ఉన్నాయని, మన వ్యక్తిత్వం, మన ఆలోచనలు మెరుగు పడాలంటే దేవాలయ సందర్శన అవసరమని చిన్న జీయర్ స్వామి అన్నారు. మన ముఖం ఎలా ఉందో తెలియాలంటే అద్దం కావాలి.. అదే విధంగా అద్దం లేకుండా మన ముఖం ఎలా ఉందో తెలియాలంటే ప్రతి రోజు దేవాలయంకు వెళ్లాలని చిన్న జీయర్ స్వామి సూచించారు. దేవాలయాలను వాణిజ్య సంస్థలు కొందరు మారుస్తున్నారని, అది మనం చేసుకున్న తప్పిదం అన్నారు చిన్న జీయర్ స్వామి. మనలోని లోపాలను దేవుడికి ఆపాదించడం మంచిది కాదన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి.. బాధిత కుటుంబానికి రూ. 9 కోట్లు చెల్లించాలని సుప్రీంకోర్టు

**2009 జూన్ 13న కారులో అన్నవరం నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా ఢీకొట్టిన బస్సు**

**రూ. 9 కోట్ల పరిహారం ఇప్పించాలని సికింద్రాబాద్ మోటార్ యాక్సిడెంట్స్ ట్రైబ్యునల్‌లో కేసు వేసిన మహిళ భర్త**

**రూ. 8.05 కోట్ల పరిహారం చెల్లించాలని 2014లో తీర్పు**

**హైకోర్టులో సవాలు చేసిన ఆర్టీసీ యాజమాన్యం**

రూ. 5.75 కోట్లకు తగ్గించి తీర్పు చెప్పిన తెలంగాణ హైకోర్టు

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసిన బాధిత మహిళ భర్త

ఆయనకు అనుకూలంగా తీర్పు చెప్పిన సుప్రీం ధర్మాసనం

బస్సు ఢీకొనడంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి 9 కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఏపీఎస్ ఆర్టీసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. లక్ష్మి నాగళ్ల అనే మహిళ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. స్వదేశం వచ్చిన ఆమె 2009 జూన్ 13న భర్త, ఇద్దరు కుమార్తెలతో కలిసి కారులో అన్నవరం నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో లక్ష్మి మృతి చెందారు. ఈ నేపథ్యంలో తన భార్య మృతికి కారణమైన ఆర్టీసీ నుంచి రూ. 9 కోట్ల పరిహారం ఇప్పించాలని మృతురాలి భర్త శ్యాంప్రసాద్ నాగళ్ల సికింద్రాబాద్ మోటార్ యాక్సిడెంట్స్ ట్రైబ్యునల్‌లో కేసు వేశారు.

వాదనలు విన్న ట్రైబ్యునల్ రూ. 8.05 కోట్ల పరిహారం చెల్లించాలని 2014లో ఆర్టీసీని ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆర్టీసీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. విచారించిన న్యాయస్థానం పరిహారాన్ని రూ. 5.75 కోట్లకు తగ్గించి తీర్పు చెప్పింది. అయితే, ఈ తీర్పును మృతురాలి భర్త సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

తన భార్య అమెరికాలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి, అక్కడ శాశ్వత నివాసిగా ఉందని, నెలకు రూ. 11,600 డాలర్లు సంపాదిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆమె మరణానికి కారణమైన ఆర్టీసీ నుంచి రూ. 9 కోట్ల పరిహారం ఇప్పించాలని కోరారు. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన సుప్రీం ధర్మాసనం నిన్న ఈ కేసును విచారించింది. బాధిత కుటుంబానికి అనుకూలంగా తీర్పు చెప్పింది. లక్ష్మి కుటుంబానికి రూ. 9,64,52,220 చెల్లించాలని ఏపీఎస్ ఆర్టీసీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## భారత్ బయోటెక్ మరో ఘనత




**సత్యమేవ జాయతే - భారత్** భారత్ బయోటెక్ మరో ఘనతప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా పాడి పశువుల చర్మ సంరక్షణకు రూపొందించిన లంపీస్కిన్ డిసీజ్కి భారత్ బయోటెక్ వ్యాక్సిన్ కనిపెట్టింది.

కర్ణాటక రాష్ట్రంలోని మల్లూరులో లంపీస్కిన్ డిసీజ్ నివారణకు రూపొందించిన దివా మార్కర్ వ్యాక్సిన్ కు సోమవారం సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ ఆమోదం లభించింది.

ఇది ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన మొట్టమొదటి వ్యాక్సిన్ అని భారత్ బయోటెక్ పేర్కొంది.

## మహా కుంభమేళా నీటితో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి అభిషేకం చేసిన భక్తుడు



**సత్యమేవ జయతే - రాజన్న సిరిసిల్ల** రాజన్న సిరిసిల్ల : ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ లో జరుగుతున్న మహకుంభమేళ లో తీసుకువచ్చిన నీటితో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఓ భక్తుడు అభిషేకం చేశాడు. మంచిర్యాలకు చెందిన పద్మ సందేశ్ గుప్తా అనే భక్తుడు కుంభమేళా త్రివేణి సంగమం నీటిని అలాగే మంచిర్యాల లోని గోదావరి నీటిని సేకరించి మంచిర్యాల నుండి వేములవాడకు పాదయాత్ర చేపట్టాడు. సుమారు 120 కిలోమీటర్లు నడిచి మంగళవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి అభిషేకం చేసినట్లు తెలిపాడు. లోక కళ్యాణార్థం ఈ క్రతవును నిర్వహించామని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. మహా కుంభమేళా నీటితో శివలింగం మరింత శక్తివంతంగా మారుతుందని వారు తెలిపారు. వారి వెంట తాటికొండ పవన్, సంతోష్ లు ఉన్నారు.



**సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్.** రూ. 4.30 కోట్లతో వికారాబాద్ నియోజకవర్గం కోట్ పల్లి మండలంలోని జిన్నారం, కంకణాలపల్లి, మాల్ శెట్టి పల్లి, రాంపూర్, కొత్తపల్లి, ఎన్నారం, ఎన్కపల్లి, కరీంపూర్, బర్వాద్, మద్గుల్ తండా, మొత్కుపల్లి, నాగసానిపల్లి తండా, బీరోలు గ్రామాలలో ఈరోజు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి,వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌ. శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పనులను ప్రారంభించారు

## అవి ప్రపంచాన్ని ఏలబోతున్నాయి: తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు

**తెలంగాణలో మౌలిక సదుపాయాలకు ఎలాంటి లోటు లేదన్న మంత్రి**

**ఐటీలో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామన్న శ్రీధర్ బాబు**

**సాంకేతికత ప్రతి ఒక్కరికీ చేరాలని తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్య**

**చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించిన మంత్రి**

ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ ప్రపంచాన్ని ఏలబోతున్నాయని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు ఎలాంటి లోటు లేదని, గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో 32వ హైసియా (హైదరాబాద్ సాఫ్ట్ వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, ఐటీలో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామని అన్నారు.కంపెనీలకు బెస్ట్ స్కిల్స్ అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఏఐ, మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతికతను ఇప్పటికే మనం అందిపుచ్చుకున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో సాంకేతిక వినియోగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని అన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ పారిశ్రామిక, ఐటీ హబ్‌గా ఉందని ఆయన చెప్పారు.

సాంకేతికత ప్రతి ఒక్కరికీ చేరాలని తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అంతరిక్షంలో, సైన్యంలో సాంకేతికత పెరిగిందని, అందుకే మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. దేశీయ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా క్రమంగా పెరుగుతోందని అన్నారు. ఐటీ రంగంలో నియామకాలు కూడా హైదరాబాద్‌లో పెరుగుతున్నట్లు చెప్పారు.

చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాముడి పేరుతో దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రంగరాజన్‌పై జరిగిన దాడిని తమ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలను తమ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు.

# ఈ ఖనిజాలు అందితే ఆరోగ్యం సూపర్..

**మన ఆరోగ్యం బాగుండాలంటే రోజూ తినే ఆహారంలో ఎన్నో రకాల పోషకాలు ఉండాల్సిందే. ఆహారంలోని కార్బోహైడ్రేట్లు, కొవ్వులు శక్తినిచ్చినా.. మన శరీరంలోని అన్ని అవయవాలు సరిగా పనిచేయాలంటే విటమిన్లు, ప్రొటీన్లు, అమైనో ఆమ్లాల వంటి పోషకాలు కూడా అందాలి. వీటితోపాటు కొన్ని ఖనిజ లవణాలూ శరీరానికి అత్యవసరం. వాటిలోనూ స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు లేదా ట్రేస్ మినరల్స్ అని రెండు రకాలు. కాల్షియం, సోడియం, పొటాషియం, క్లోరిన్ (క్లోరైడ్), మెగ్నీషియం, ఫాస్ఫేట్ లు స్థూల పోషకాలు. శరీరంలో ఎముకలు, కండరాలు, గుండె, మెదడుల పనితీరు స్థూల పోషకాలపై ఆధారపడి ఉంటుంది. ఇక క్రోమియం, కాపర్, ఫ్లోరైడ్, అయోడిన్, ఐరన్, మాంగనీస్, మాలిబ్డినమ్, సెలీనియం, జింక్ లు సూక్ష్మ పోషకాలు లేదా ట్రేస్ మినరల్స్. ఇందులో క్రోమియం రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు సాధారణంగా ఉండేందుకు తోడ్పడుతుంది. మిగతా ట్రేస్ మినరల్స్ అన్నీ శరీరంలో హార్మోన్లు, ఎంజైముల తయారీకి అవసరం. మరి ఈ ఖనిజ లవణాలు ఏమిటి, వేటి నుంచి అవి లభిస్తాయి, లోపిస్తే వచ్చే సమస్యలేమిటి, ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో తెలుసుకుందాం.. రోజూ అందాల్సిందే.. ఖనిజ లవణాలన్నీ తక్కువ స్థాయిలోనే అయినా శరీరానికి అత్యంత అవసరం.**

అంతేకాదు ఇవి రోజూ శరీరానికి అందాల్సిందే. లేకపోతే మనకు ఎన్నో రకాల అనారోగ్యాలు, వ్యాధులు కలుగుతాయి. సాధారణంగా ఈ ఖనిజ లవణాలన్నీ మనం తీసుకునే ఆహారం ద్వారానే లభిస్తాయి. పోషకాహారం తీసుకునేవారిలో ఖనిజ లవణాల లోపం ఏర్పడే అవకాశం తక్కువ. కాల్షియం, అయోడిన్, ఐరన్ ల లోపం మాత్రం ఎక్కువగా కనిపిస్తుంటుంది. అంతేగాకుండా ఎప్పుడూ ఒకే రకమైన ఆహారం తీసుకోవడం లేదా కొన్ని రకాల ఆహారానికి పూర్తిగా దూరంగా ఉండడం వల్ల కూడా ఖనిజ లవణాల లోపం ఏర్పడుతుంది. ఉదాహరణకు గుడ్లు, పాల పదార్థాలు, శాకాహారం మాత్రమే తీసుకునే వారిలో ఐరన్ లోపిస్తుంది. ఇక శిశువులకు ఖనిజ లవణాల అవసరం ఎక్కువ. ఎందుకంటే వారిలో పెరుగుదల వేగం ఎక్కువగా ఉంటుంది. ఖనిజ లవణాలేవైనా ఒక పరిమిత స్థాయికి మించి సప్లిమెంట్ల రూపంలో తీసుకుంటే అవి శరీరానికి విషంగా పరిణమించే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వీటి లోపం ఏర్పడినవారు తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో, వారు సూచించిన మోతాదుల్లోనే వినియోగించాలి.

స్థూల ఖనిజాలు

ప్రాణాధారం

.. ఖనిజ లవణాలు శరీరానికి ప్రాణాధారం. ఇవి కణాల లోపలి నుంచి శరీరం మొత్తం మీద వివిధ ద్రవ పదార్థాల స్థితిని కాపాడుతాయి. ఈ ఖనిజ లవణాలతో తయారయే ఎలక్ట్రోలైట్లు నాడులు, కండరాల పనితీరును నియంత్రిస్తాయి. శరీరంలో ఆమ్లయుత-క్షారయుత పరిస్థితిని సమతుల్యం చేస్తాయి. ఒకవేళ ఖనిజ లవణాల లోపం ఏర్పడితే ఎలక్ట్రోలైట్లు తగ్గిపోయి.. శరీరంలో నీటి శాతం పడిపోతుంది. కండరాలు, నాడుల పనితీరు దెబ్బతింటుంది. ఇది చివరికి మరణానికి కూడా దారితీసే అవకాశం ఉంటుంది. ఈ ఖనిజ లవణాల లోపాన్ని రక్త, మూత్ర పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. ఎముకలు, కండరాలకు కాల్షియం.. శరీరంలో ఎముకలు, దంతాలు ఏర్పడడానికి, ఎముకలు బలహీనం కాకుండా ఉండడానికి, విరిగిన ఎముకలు అతుక్కోవడానికి ఇది తోడ్పడుతుంది. గాయాలైనప్పుడు రక్తం గడ్డకట్టడానికి, కండరాల పనితీరు సరిగా ఉండడానికి కాల్షియం, గుండె సరిగా కొట్టుకోవడానికి, శరీరంలో చాలా రకాల ఎంజైములు సరిగా పనిచేయడానికి కూడా కాల్షియం అత్యవసరం. శరీరానికి తగిన మోతాదులో కాల్షియం అందకపోతే రక్తంలో కాల్షియం లోపిస్తుంది. దాంతో శరీరం ఎముకల నుంచి కాల్షియంను రక్తంలోకి తరలిస్తుంది. దీనినే 'హైపోకాల్సిమియా' అంటారు. దీంతో ఎముకలు బలహీన పడి 'ఆస్టియోపోరోసిస్' సమస్య తలెత్తుతుంది. చిన్నపాటి దెబ్బలు, ప్రమాదాలకే విరిగిపోతాయి. మనిషి శరీర బరువులో 1.5 నుంచి 2 శాతం దాకా కాల్షియం ఉంటుంది. కాల్షియం ఎక్కువగా పాలు, పాల పదార్థాలు, మాంసం, గుడ్లు వంటి పదార్థాల్లో లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు 1,000 మిల్లీగ్రాములు, 50 ఏళ్లు పైబడిన వారికి 1,200 మిల్లీగ్రాముల కాల్షియం అవసరం. ఇది రోజుకు 2,500 మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే శరీరానికి విషపూరితంగా మారుతుంది. శరీరంలో కాల్షియం స్థాయి ఎక్కువైతే 'హైపర్ కాల్సిమియా' సమస్య తలెత్తుతుంది.

దానివల్ల అజీర్తి, విపరీతమైన దాహం, కడుపునొప్పి, ఆకలి మందగించడం, మూత్రం ఎక్కువగా రావడం, గందరగోళపడడం వంటి మానసిక సమస్యలు తలెత్తుతాయి. చివరికి కోమాలోకి వెళ్లి మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. కణాలకు, శరీర సమతుల్యతకు సోడియం .. నాడులు, కండరాలు సరిగా పనిచేయడానికి, శరీరంలో ద్రవాల సమతుల్యతకు సోడియం అత్యవసరం. రక్తంలోను, కణాల చుట్టూ ఉండే ద్రవం (ఫ్లూయిడ్)లోను సోడియం ఉంటుంది. ఇది గ్లూకోజ్, నీరు, అమైనో ఆమ్లాల రవాణాలో తోడ్పడుతుంది. సాధారణంగా సోడియం లోపం ఏర్పడడం అరుదు. శరీరం నుంచి ద్రవాలు విపరీతంగా వెళ్లిపోయే డీహైడ్రేషన్ (అతి మూత్రం, వాంతులు, విరేచనాలు, విపరీతంగా చెమట పట్టడం వంటివి), కిడ్నీలు దెబ్బతినడం, శరీరంపై తీవ్రంగా కాలిన గాయాలు కావడం వంటి పరిస్థితుల్లో శరీరంలో సోడియం లోపం ఏర్పడుతుంది. దీనివల్ల కండరాల వణుకు, బిగుసుకుపోవడం, గందరగోళం, స్పృహ తప్పిపోవడం వంటి ప్రమాదాలు ఏర్పడుతాయి. ఈ పరిస్థితి మరీ తీవ్రమైతే కోమాలోకి వెళ్లిపోతారు, మరణం కూడా సంభవించవచ్చు. ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉండే ద్రవాలను తీసుకోవడం ద్వారా, సోడియం ద్రవాన్ని నరాల ద్వారా ఎక్కించడం ద్వారా లోపాన్ని అధిగమించవచ్చు. అయితే సోడియం ఎక్కువగా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు తలెత్తుతాయి. రక్తంలో ద్రవాల శాతం పెరిగి రక్తపోటుకు దారితీస్తుంది. గుండెపోటు, కడుపులో కేన్సర్, కిడ్నీ వ్యాధులు, కాలేయ సమస్యలు తలెత్తుతాయి. సోడియం ఖనిజానికి ప్రధానమైన వనరు ఉప్పు. మాంసం, వెన్న, ఆలివ్, మొక్కజొన్న, బంగాళదుంపల్లో కూడా ఇది లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు 1,000 మిల్లీగ్రాముల సోడియం అవసరం. దీనిని రోజుకు 2,400 మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే శరీరానికి విషపూరితంగా మారుతుంది. ప్రస్తుతం మారిన ఆహార అలవాట్ల కారణంగా శరీరానికి అందే సోడియం శాతం చాలా ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోని ఆహార పదార్థాలు, బేకరీల్లోని జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, ఇంట్లోనూ ఉప్పు అధికంగా వినియోగించడం వంటివాటి వల్ల అధికంగా సోడియం అందుతోంది. ఇది ఎన్నో సమస్యలకు దారితీస్తుంది. మెదడు, కండరాల ఆరోగ్యానికి పొటాషియం శరీరారానికి అత్యంత అవసరమైన పోషకాల్లో పొటాషియం ప్రధానమైనది. ముఖ్యంగా నాడులు, కండరాలు సక్రమంగా పనిచేయాలంటే శరీరానికి తగిన మోతాదులో పొటాషియం అందాల్సిందే. అంతేకాదు గుండె జబ్బుల నివారణ, రక్తపోటు నియంత్రణలోనూ ఇది కీలకం. ఎముకలు దృఢంగా ఉండడానికి, మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడానికి తోడ్పడుతుంది. శరీరంలో ఉండే పొటాషియంలో చాలా వరకు కణాల అంతర్భాగంలో ఉంటుంది. పొటాషియం స్థాయిలు బాగా పెరిగినా.. బాగా తగ్గినా కూడా ఇబ్బందే. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదమూ ఉంటుంది. పొటాషియం లోపం వల్ల కండరాలు బలహీనమైపోతాయి. అది తీవ్రమైతే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంటుంది. హైపర్ థైరాయిడిజం సమస్య తలెత్తుతుంది.

పాలు, అరటిపండ్లు, టామాటా, నారింజ, పుచ్చకాయ, బంగాళదుంప, చిలగడదుంప, పాలకూర, ఆకుపచ్చని కూరగాయలు, బఠాణీ, చిక్కుడు వంటి గింజలు, ఓఆర్ఎస్ పౌడర్ వంటి ఎలక్ట్రోలైట్ ద్రవాల్లో పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. ఇది సాధారణ వ్యక్తులకు రోజుకు 3.5 గ్రాముల వరకు అవసరం. చిన్న పిల్లలు, గర్భిణులకు మరింత ఎక్కువగా అంటే 4.7 గ్రాముల వరకు అందాలి. అయితే దీర్ఘకాలం పాటు పొటాషియం ఎక్కువ మోతాదులో అందడం వల్ల గుండెకు చేటు కలుగుతుంది. రక్త పరీక్షల ద్వారా శరీరంలో పొటాషియం స్థాయులను తెలుసుకోవచ్చు. బీడీలు, సిగరెట్లు, ఖైనీల వంటి పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్ కారణంగా.. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, కొన్ని రకాల మందుల వినియోగం వల్ల శరీరంలో పొటాషియం లోపం ఏర్పడుతుంది. దీనిని హైపోకాలేమియా అంటారు. లోపం ఉన్నవారు ఆహారంలో మార్పులు, సప్లిమెంట్ల ద్వారా తీసుకోవచ్చు. ఇక మూత్ర పిండాలు దెబ్బతినడం, కొన్ని రకాల మందులు, అధికంగా పొటాషియం ఉండే ఆహారం తీసుకోవడం వంటి కారణాల వల్ల శరీరంలో పొటాషియం స్థాయి పరిమితికి మించి పెరుగుతుంది. దీనివల్ల కండరాల బలహీనత, గుండె కొట్టుకునే వేగంలో మార్పులు, చివరికి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తపోటు నియంత్రణకు క్లోరిన్ (క్లోరైడ్) : శరీరంలో ద్రవాల స్థితిని సమతూకంగా ఉంచేందుకు క్లోరైడ్ అత్యవసరం. అంతేగాకుండా కండరాల పనితీరుకు, రక్త పోటును నియంత్రణలో ఉంచడానికి ఇది తోడ్పడుతుంది. అయితే సాధారణంగా క్లోరైడ్ లోపం ఏర్పడడం చాలా అరుదు. ఎందుకంటే



మనం నిత్యం ఉపయోగించే అన్ని రకాల ఆహార పదార్థాల్లోనూ ఉప్పును వినియోగిస్తాం. దాని నుంచి తగిన మోతాదులో క్లోరైడ్ అందుతుంది. క్లోరైడ్ కు ప్రధాన వనరు మనం సాధారణంగా వినియోగించే ఉప్పు. దీంతోపాటు వెన్న, ఆలివ్, మొక్కజొన్న బ్రెడ్, ఆలూ చిప్స్ వంటి ప్రాసెస్డ్ ఆహారం, మాంసంలోనూ లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు ఒక గ్రాము (1000 మిల్లీగ్రాముల) క్లోరైడ్ అవసరం. క్లోరిన్ స్వతహాగా విషపూరితమైన పదార్థం. అది పరిమితికి మించితే ప్రమాదకరంగా మారుతుంది. అయితే ఆహారం ద్వారా అధికంగా అందే క్లోరిన్ ను శరీరం ఎప్పటికప్పుడు విసర్జిస్తూ ఉంటుంది.

ఎదుగుదలకు తోడ్పడే మెగ్నీషియం .. శరీరంలో ఎముకలు, దంతాల నిర్మాణానికి.. నాడులు, కండరాల పనితీరు సరిగా ఉండడానికి మెగ్నీషియం అత్యవసరం. ముఖ్యంగా శరీరంలో వివిధ అవయవాలు విడుదల చేసే ఎంజైములు క్రియాశీలం కావడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది.



# తరచూ అలెర్జీ సమస్యలు... ఎందుకని?

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా... అలెర్జీ అన్న పదం వినిపిస్తూనే ఉంటుంది. మన చుట్టూ ఉన్న వారిలో చాలా మందిలో ఈ సమస్య కనిపిస్తుంది. తుమ్ములు, దగ్గు, ముక్కు కారటం, దురదలు ఇలా అలెర్జీ వలన కనిపించే లక్షణాలు, సమస్యలు చాలా మందికి అనుభవమే. ప్రపంచ వ్యాప్తంగా 10 నుంచి 30 శాతం మంది వరకు అలెర్జీ బాధితులే. ఆధునిక కాలంలో బాగా విస్తరించిపోయిన ఈ సమస్య గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

అలెర్జీ అంటే ఏంటి...? ఆహారం, పుప్పొడి రేణువులు, దుమ్ములోని పురుగులు (డస్ట్ మైట్స్), మందులు, ఇలా ఎన్నో వాటి వల్ల ఈ సమస్య వస్తుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ అన్నది మన శరీరంలో అతి క్లిష్టమైన వ్యవస్థ. వైరస్, బ్యాక్టీరియా, టాక్సిన్ల (ఫారిన్ సబ్ స్టాన్స్/ఫారిన్ ఇన్వేడర్స్) నుంచి మన శరీరాన్ని కాపాడుతూ ఉండే వ్యవస్థ. అలెర్జీ కారకాలు మన శరీరంలోకి చొరబడడం ఆలస్యం వీటిని హానికారకాలుగా గుర్తించిన ఆ క్షణమే రోగ నిరోధక వ్యవస్థ వాటిపై దాడి మొదలు పెడతుంది. ఉదాహరణకు ఓ పుప్పొడి రేణువు (అలెర్జీ కారకం) మన శరీరంలోకి ప్రవేశించిందనుకోండి. అప్పుడు రోగ నిరోధక వ్యవస్థ ఆ పుప్పొడి ఎక్కడ ఉందో గుర్తిస్తుంది. దానిపై పోరాడేందుకు యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తుంది. ఈ యాంటీ బాడీలనే ఇమ్యునోగ్లోబులిన్లు (వీటిలోనూ ఐజీఈ, ఐజీజీ, ఐజీఎం, ఐజీఏ రకాలున్నాయి) అంటారు. ఈ యాంటీబాడీలు కణాల్లోకి ప్రయాణం చేసి పుప్పొడిపై దాడికి గాను రసాయనాలను విడుదల చేస్తాయి. ఇవే అలెర్జీ రియాక్షన్ కు కారణం అవుతాయి. ఈ రియాక్షన్ ముక్కు, ముక్కు నాసికా కుహరములలోను, గొంతు, ఊపిరితిత్తులు, చెవులు, కడుపు, చర్మంలోపల లక్షణాలకు దారితీస్తుంది. కొన్ని పదార్థాలే ఎందుకు అలెర్జీకి దారితీస్తాయి, వేరేవి ఎందుకు కారణం కావన్న దానికి ఇంత వరకు కచ్చితమైన కారణాలు నిర్ధారణ కాలేదు. అలాగే, కొందరు అలెర్జీకి లోనైతే, అవే కారకాలు మరికొందరిలో అలెర్జీకి దారితీయకపోవడం వెనుకనున్న కారణాలను కూడా పరిశోధనలు ఇతమిద్ధంగా తేల్చలేదు.



అలెర్జిక్ రైనైటిస్ (ముక్కు కారటం), అలెర్జిక్ కంజెంక్టివైటిస్ (కంటి దురదలు, అలెర్జీలు), అలెర్జిక్ ఆస్తమా, యుర్టికేరియా (హైవ్స్), ఫుడ్ అలెర్జీలు. ఇవి అతి సాధారణంగా, ఎక్కువగా కనిపించే అలెర్జీలు. అలెర్జీ కారకాలను గాలి ద్వారా పీల్చవచ్చు. ఆహారం ద్వారా కడుపులోకి తీసుకోవచ్చు. మందులు లేదా పురుగు కాటు ద్వారా చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించొచ్చు. ఏ మార్గం ద్వారా శరీరంలోకి ప్రవేశించాయన్నదాన్ని బట్టి అలెర్జీ లక్షణాలు కనిపిస్తాయి. ఉదాహరణకు ఆహారంలో అలర్జీ కారకాలుంటే దాన్ని తీసుకున్నప్పుడు విడుదలయ్యే మీడియేటర్స్ చర్మంపై దద్దుర్లకు కారణమవుతాయి. అలెర్జిక్ రైనైటిస్ : అలెర్జిక్ వ్యాధుల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఇది. కాలానుగుణంగా లేదా ఎప్పుడూ ఉండొచ్చు. దీన్ని హేఫీవర్ అని కూడా అంటుంటారు. అదే పనిగా తుమ్ములు, ముక్కు కారటం, ముక్కులు మూసుకుపోవడం, ముక్కులో, కళ్లల్లో, నోటి పై భాగంలో దురద ఉంటుంది. ఈ సమస్య ఎప్పుడూ వేధిస్తుంటే ఇంట్లో ఉండే డస్ట్ మైట్స్, పెంపుడు జంతువులు, బూజు కారణం కావొచ్చు. ప్రధానంగా గాలిలో చేరిన అలెర్జీ కారకాలు శ్వాస తీసుకునే సమయంలో ముక్కుల్లో చేరడం వల్ల ఈ సమస్య నిరంతరం వేధిస్తుంటుంది. అలెర్జీ కారకాలు ముక్కులోపలికి చేరిన తర్వాత కణజాలం వాపునకు గురవుతుంది. ఈ అలెర్జీకి కళ్లు, చెవులు, సైనస్ తోనూ సంబంధం ఉంటుంది. యుర్టికేరియా (దద్దుర్లు) : చర్మంపై ఎర్రటి దద్దుర్లు కనిపిస్తాయి. పెద్దగా లేదా చిన్నగా ఉండొచ్చు. దురద ఉంటుంది. కొన్ని రకాల ఆహార పదార్థాలు, మందుల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. చిన్నారుల్లో వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా రావచ్చు. అలెర్జిక్ కంజెంక్టివైటిస్ : అలెర్జీ కారకాలకు కళ్లు స్పందించినప్పుడు ఏర్పడే లక్షణాలు కళ్లు ఎర్రబారడం, దురద, వాపు. నీరు కారడం, కనుగుడ్డు చుట్టుపక్కల, కను రెప్పల లోపలి వైపు భాగంలో వాపు, మంట వుంటాయి. ఆస్తమా : ఆస్తమా అన్నది దీర్ఘకాలిక, ఎడతెగని ఊపిరితిత్తుల సమస్య. దగ్గు, ఛాతీ బిగపట్టినట్టు ఉండడం, శ్వాస సరిగా తీసుకోలేకపోవడం, పిల్లికూతలు తదితర లక్షణాలు కనిపిస్తాయి.

ఆస్తమా లక్షణాల్లో శ్వాస నాళా ల్లో వాపు వచ్చి అవి కుచించుకుపోతా యి. దాంతో శ్వాస కష్టంగా అనిపిస్తుంది. ఆస్తమా సమస్య ఉన్న 78 శాతం మందిలో అలెర్జిక్ రైనైటిస్ కూడా ఉంటుంది. ఈ రెండింటికీ ఒకదానితో ఒకటి సంబంధం ఉంది. ఎక్కువ మందిలో అలెర్జిక్ రైనైటిస్ తోనే మొదలై ఆస్తమాగా మారుతుంది. ఆస్తమా ఉన్న వారికి శ్వాసకోస ఇన్ఫెక్షన్లు వస్తే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుంది.

ఫుడ్ అలెర్జీ : ఫుడ్ అలెర్జీ ఉన్న వారికి కొన్ని రకాల ఆహార పదార్థాలు సరిపడవు. దీంతో ఆ పదార్థాలు తీసుకున్నప్పుడు అందులో ఉండే అలెర్జీ కారకాలపై పోరాడేందుకు రోగ నిరోధక వ్యవస్థ స్పందిస్తుంది. ఆవు పాలు, గుడ్లు, వేరు శనగ, గోధుమ, సోయా, చేపలు, షెల్ ఫిష్, నట్స్ లో ఉండే కాంపోనెంట్స్ వల్ల ఫుడ్ అలెర్జీలు వచ్చే అవకాశం ఉంది. యాంటీబయోటిక్స్ (పెన్సిలిన్), యాస్పిరిన్, ఐబూప్రోఫెన్ తరహా యాంటీ ఇన్ఫ్లమ్మేటరీ ఔషధాల వల్ల కూడా అలెర్జిక్ రియాక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

సైనసైటిస్ :నాసికా కుహరములలో (ముక్కకు అనుసంధానంగా ముక్కు పక్క న కంటి కింద భాగంలో ఉండేవి) వాపునే సైనసైటిస్ అంటారు. సైనసైటిస్ సమస్యలో ఇలా వాపు కారణంగా రంధ్రాలు మూసుకుపోతాయి. అవి ఫ్లూయిడ్ తో పూడుకుపోతాయి. అప్పుడు క్రిములు వృద్ధి చెంది ఇన్ఫెక్షన్ కు దారితీస్తాయి. తలనొప్పి, ముక్కు భాగంలో నొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తీవ్రమైన అలెర్జిక్ రియాక్షన్స్ : అనాఫిలాక్సిస్ అనేది తీవ్రమైన ప్రాణాంతక అలెర్జిక్ రియాక్షన్. ఆహార పదార్థాలు, పురుగులు కుట్టడం, మందుల వల్ల ఈ రియాక్షన్ రావచ్చు. ఒకే సమయంలో ఒకటికి మించిన ప్రాంతాల్లో ఈ రియాక్షన్ వచ్చే అవకాశాలూ ఉన్నాయి. వేడిగా ఉండడం, ఎర్రబారడం, ఎర్రగా ర్యాష్ ఉండి దురద పెట్టడం, శ్వాస సమస్య, గొంతు పట్టేసినట్టు ఉండడం, ఆందోళన, వాంతులు, డయేరియా, తిమ్మిర్లు వంటివి కనిపిస్తాయి. కొందరిలో రక్తపోటు పడిపోయి షాక్ కు లోను కావచ్చు. ఈ రియాక్షన్ కు వెంటనే చికిత్స ఇప్పించాలి. లేకుంటే ప్రాణాంతకం అవుతుంది.



అలెర్జీలు కనిపిస్తే ఏం చేయాలి...? అలెర్జీ సమస్యలు కనిపిస్తే ఇమ్యునాలజిస్ట్ లేదా ఎండీని సంప్రదించాలి. కుటుంబ ఆరోగ్య చరిత్ర, శారీరక పరిశీలన, చర్మ పరీక్ష, రక్త పరీక్షల ద్వారా వైద్యులు అలెర్జీ కారకాలను గుర్తిస్తారు. ఆ తర్వాత దాన్ని కంట్రోల్ చేసేందుకు ట్రీట్ మెంట్ కు ప్లాన్ చేస్తారు. ఇంజెక్షన్లు, టాబ్లెట్లు సూచించవచ్చు. యాంటీ హిస్టామిన్స్, నాసల్ యాంటీ హిస్టామిన్స్, నాసల్ కార్టికోస్టెరాయిడ్ డ్రాప్స్, ఆస్తమాలో ఇన్ హేలర్స్, ఓరల్ స్టెరాయిడ్స్ ఇలా మందులు సూచిస్తారు. ఇవి కూడా దీర్ఘకాలం పాటు వాడాల్సి ఉంటుంది. దాదాపు చాలా రకాల అలెర్జీలకి శాశ్వత నిర్మూలన లేదు. వాటిని అదుపు చేయడం వరకే చికిత్స. అలెర్జీలకు సమర్థవంతమైన చికిత్స కోసం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ, ఇంతవరకూ వాటిని పూర్తిగా నిర్మూలించే సమర్థవంతమైన చికిత్సలు సాధ్యం కాలేదు. పిల్లల్లో ఆహారం, మందుల పరంగా ఉన్న అలెర్జీలు తర్వాత కాలంలో వాటంతట అవే కనుమరుగు అయ్యే అవకాశం ఉంటుంది.

ఎవరికి రిస్క్ : అలెర్జీలు ఏ వయసులోనయినా రావచ్చు. ఆహార పరమైన అలెర్జీలు మాత్రం చిన్న వయసులోనే మొదలవుతాయి. కుటుంబ చరిత్ర, జెనెటిక్స్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. తల్లిదండ్రులకు అలెర్జీలు ఉంటే పిల్లలకూ అవి రావడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. సహజంగా జన్మించడం కాకుండా, సిజేరియన్ ద్వారా పుట్టిన పిల్లలకు అలెర్జీల రిస్క్ ఎక్కువగా ఉంటుంది. నివారణ : పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి. ఇది ఈ రోజు దాదాపుగా అసాధ్యం. ఇంట్లో ఉండే డస్ట్ మైట్స్ వల్ల అలెర్జీలు వస్తుంటే తేమ తక్కువ ఉండేలా చూసుకోవడంతోపాటు వారానికోసారి బెడ్ షీట్స్, పిల్లో కవర్స్, బ్లాంకెట్లను వేడినీటితో వాష్ చేయాలి. ఇంట్లో పెంపుడు జంతువుల కారణంగా అలెర్జీలు వస్తుంటే వాటిని ఇంట్లో లేకుండా చూసుకోవాలి. అలాగే, ఇంట్లో పీల్చే వాయువును స్వచ్ఛంగా మార్చేందుకు ఎయిర్ ప్యూరిఫయర్లు మార్కెట్లో ఉన్నాయి.

సత్యమేవ జయతే



# విశుద్ధ భక్తులుగా మార్చే భక్తిమంత్రం దామోదర దివ్య



పరమ పవిత్రమైన కార్తీకమాసానికే 'దామోదర మాసమని' కూడా పేరు. వైష్ణవ సంప్రదాయాన్ని పాటించేవారిలో కొందరు ఈ ప్రత్యేక మాసాన్ని పౌర్ణమినుండి పౌర్ణమివరకు, మరికొందరు అమావాస్యనుండి అమావాస్య వరకు జరుపుకుంటారు. ఈ మాసం పొడుగునా భక్తులు శ్రీకృష్ణుడిని దామోదరుడిగా కొలవడం విశేషం. తల్లి యశోద చేతిలో బద్ధుడై తాడుతో రోకలికి కట్టేయించుకున్న చిన్ని కృష్ణుని లీలనే 'దామోదర లీల'గా ప్రసిద్ధి చెందింది. ఆ విశేషాలే ఈవారం ఇక్కడ.

గోష్టే దామోదర ఇతి గోపీభిః పరిగీయత

శ్రీకృష్ణునికిగల ఈ దామోదర నామం గొప్పతనాన్ని ఈ శ్లోకం చక్కగా వివరించింది. శ్రీకృష్ణుడు ఏ విధంగా భక్త పరాధీనుడో 'దామోదర లీల' చాటుతుంది. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడైనా, దేవతామూర్తులు అందరూ వారి ఆధీనంలోనే వున్నా తన విశుద్ధభక్తురాలైన యశోదమ్మకు మాత్రం తానే బద్ధుడయ్యాడు. అదెలా అన్నదే ఇక్కడ అత్యంత ఆసక్తికరం. యశోదా కృష్ణుల మధ్యగల ఈ వాత్సల్యరసాన్ని శ్రీల ప్రభుపాదులవారు గొప్పగా వ్యాఖ్యానించారు. 'దేవదేవుడైన శ్రీకృష్ణుని లీలలతో కలిగే సంభ్రమాశ్చర్యాలకు ఇదొక ఉదాహరణ. సకల సర్వావస్థలలోనూ భగవంతుడు భగవంతుడే. తాను దేవాదిదేవుడైనా సరే, తన శుద్ధభక్తుని ముందు మాత్రం ఒక ఆటవస్తువుగా మారతాడు. విశుద్ధభక్తులైనవారు కేవలం అంతటి నిర్మలమైన ప్రేమభావనతోనే శ్రీకృష్ణునికి భక్తిపూర్వక సేవలు చేస్తారు. ఆ సమయంలో ఆ శుద్ధభక్తులు ఒక్కోసారి భగవంతుని నిజస్థితినీ మరచిపోతుంటారు. సహజ అనురాగంతో, అప్రయత్న పూర్వకంగా, ఐశ్వర్యభావ రహితంగా వారు చేసే ఆరాధనలను భగవంతుడు మరింత ప్రియంగా స్వీకరిస్తాడు.

భగవంతుడు ఎప్పుడు అతిప్రసన్నుడవుతాడు?

సాధారణంగా, ఎక్కువ మంది భక్తులు భగవంతుణ్ణి ఐశ్వర్యభావంతోనే సేవిస్తుంటారు. కానీ, భక్తుడు తన విశుద్ధమైన ప్రేమానురాగాల కారణంతో 'భగవంతుడు తనకన్నా అంత ముఖ్యుడు కాదని' తలుస్తుంటాడు. అప్పుడే ఆ దేవదేవుడు అతిప్రసన్నుడవుతుంటాడు. ఆదిధామమైన గోలోక బృందావనంలో ఇలాంటి భావనలోనే దామోదర లీలలు సాగాయి. కృష్ణుని స్నేహితులు అతనిని తమలో ఒకనిగానే భావించారు. మర్యాదపూర్వకమైన ప్రత్యేకతలు చూపాలని అనుకోలేదు. అదే విధంగా, విశుద్ధభక్తులైన శ్రీకృష్ణుని తల్లిదండ్రులుకూడా అతనిని తమ పిల్లాడిలానే భావించారు. తల్లిదండ్రుల చివాట్లనూ 'వేదమంత్రాల ప్రార్థనలకన్నా ప్రియంగా' విన్నాడు. జనసామాన్యాన్ని ఆకర్షించే నిమిత్తం దివ్యధామమైన గోలోక బృందావనంలోని తన నిత్యలీలలను ప్రదర్శించేందుకు ఆ దేవదేవుడైన శ్రీకృష్ణుడు ఈ భౌతిక జగత్తులో అవతరించినపుడు తన తల్లి యశోదకు సంపూర్ణ ఆధీనతనే ప్రదర్శించాడు. వెన్నకుండలను పగులగొట్టి అందులోని వెన్నను మిత్రులకు, తోటి ఆటగాళ్లకు, బృందావనంలోని భాగ్యవంతమైన కోతులకు పంచి పెట్టి, యశోదమ్మ కూడబెట్టిన వెన్నను పాడు చేసేవాడు.

కన్నీటి పర్యంతమైన కృష్ణుడు

యశోదమ్మ అది చూసి, ప్రేమతో తన పుత్రునిపట్ల ఒక బూటకపు శిక్షను ప్రదర్శించాలని అనుకుంది. సాధారణంగా, ఇండ్లలో జరిగే విధంగా 'ఒక తాడు తెచ్చి బంధిస్తున్నానని' కృష్ణుడిని భయపెట్టింది. యశోదమ్మ చేతిలోని తాడును చూసి భగవంతుడు భయంతో తల దించుకొని, సామాన్య బాలుని వలె ఏడవటం ప్రారంభించాడు. ఆ కన్నీటితో కంటి కాటుక చెదరిపోయింది. కన్నీరు చిన్నిబుగ్గలపై ఏకధాటిగా కారసాగింది. శ్రీకృష్ణుని దివ్యస్థితిని గురించి తెలిసిన కుంతీదేవికి ఈ సన్నివేశం అత్యంత ప్రియంగా తోచింది. వాస్తవానికి, శ్రీకృష్ణుడు భయానికే భయం కలిగించేవాడైనా తనను శిక్షించాలనుకున్న తల్లిని చూసి భయపడ్డాడు. కుంతీదేవికి ఆ దేవదేవుని దివ్యత్వం తెలుసు. యశోదమ్మ ఇవేవీ పట్టించుకోలేదు. ఆమె స్థితి కుంతీదేవికన్నా ఉన్నతమైంది. యశోదమ్మ భగవంతుడినే తన పుత్రునిగా పొంద గలిగింది. అయితే, తన పుత్రుడు భగవంతుడనే విషయాన్ని



యశోదమ్మ మరచిపోయేలా చేసింది ఆ దేవదేవుడే. ఒకవేళ ఆమెకు శ్రీకృష్ణుని దివ్యత్వమే తెలిసి వుంటే అతనిని శిక్షించడానికి సంకోచించేది. కానీ, తాను తన ప్రియమైన తల్లిముందు బాల్యచేష్టలను ప్రదర్శించాలని శ్రీకృష్ణుడు తలచడం వల్ల ఆ విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేశాడు.

ఎంతటి అదృష్టవంతురాలో..

ఆ తల్లి తనయుల నడుమ వాత్సల్య భావన అక్షరాలకు అందనిది. అత్యంత సహజాతి సహజంగా అది వెల్లడైంది. ఈ సంఘటనను తలచుకున్న కుంతీదేవి మోహపరవశురాలైంది. ఆ తల్లీ తనయుల ప్రేమను కీర్తించడం కన్నా మరొకటి చేయలేకపోయింది. సర్వశక్తి సంపన్నుడైన శ్రీకృష్ణుడినే ప్రియపుత్రునిగా అదుపులో వుంచగలిగిన యశోదమ్మ ప్రేమస్థితి అద్వితీయం, అనిర్వచనీయం. చరాచర జగత్తులోని సమస్త ప్రాణులకూ ముక్తిని ప్రసాదించేవాడైన ఆ దేవదేవునితో బ్రహ్మదేవుడు గాని, పరమశివుడు గాని, చివరకు అర్ధాంగి సాక్షాత్తు లక్ష్మీదేవి గాని పొందని దుర్లభమైన కృప తల్లి యశోద పొందింది (శ్రీమద్భాగవతం: 10.9.20). శ్రీల ప్రభుపాదవంటి గొప్ప విశుద్ధభక్తుని మార్గనిర్దేశకత్వంలో 'మనమూ శ్రీకృష్ణునిపై అంతటి గొప్పభక్తిని కలిగివుందాం'.

అంతటి నిర్మల భక్తుడు మాత్రమే కృష్ణభక్తిని జాతి, కుల, మత బేధాలకు అతీతంగా సమస్త మానవాళికీ ప్రసాదించగలడు.

భగవంతుడు ఒక్కడే!

ఎంతోమంది తాము భగవంతుడవ్వాలనే కోరికతో ఆధ్యాత్మికంగా అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారికి చివరకు మిగిలేది వట్టి ప్రయాస మాత్రమే. ఎందుకంటే, జీవాత్మ ఎన్నటికీ భగవంతుడు కాలేడు గనుక. భగవంతుడనేవాడు ఎన్నటికీ ఒక్కడే. జీవాత్మలమైన మనమంతా భగవంతుని అంశా స్వరూపులం. పరమాత్మ ముందు జీవాత్మ అత్యంత అల్పం. కేవలం మనలోని అహంకారమే మనం పరమాత్మతో సమానమనే భావనను కలిగిస్తుంటుంది. ఇది మానవుని అతిపెద్ద భ్రమ. కానీ, భక్తులు మాత్రం తమకుగల విశుద్ధమైన ప్రేమతో యశోదమ్మలా భగవంతుణ్ణే జయిస్తుంటారు. ఇది శ్రీకృష్ణుడు తన భక్తులపై చూపే కారుణ్యవర్షం. యశోదమ్మ పొందిన ఈ మహద్భాగ్యాన్ని శుకముని కొనియాడిన తీరు అపురూపం.

# రాశిఫలాలు




**మేషం**

ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందులను అధిగమిస్తారు. మీరుచేసే ప్రతి పనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతనకార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతనకార్యాలు ప్రారంభిస్తారు.

**వృషభం**

విందులు, వినోదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంది. మానసిక ఆందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలు ఎదురవుతాయి. ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

**మిథునం**

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించడం అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్తపడటం మంచిది. అనవసర ధనవ్యయంతో రుణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం.

**కర్కాటకం**

కుటుంబంలో చిన్నచిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోవాలి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి రుణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి.

**సింహం**

మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించడం అవసరం. నూతనకార్యాలకు ఆటంకాలు ఏర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఇతరులకు హాని తలపెట్టే కార్యాలకు దూరంగా ఉంటారు.

**కన్య**

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధనలాభంతో రుణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవడానికి కృషిచేస్తారు. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు.

**తుల**

మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త పడటం మంచిది. అకాల భోజనం వల్ల అనారోగ్య బాధలను అనుభవిస్తారు. ఆకస్మిక కలహాలకు అవకాశం ఉంటుంది. చెడు సహవాసానికి దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి.

**వృశ్చికం**

మిక్కిలి ధైర్య సాహసాలు కలిగి ఉంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శత్రుబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక లాభాలు ఉంటాయి.

**ధనుస్సు**

అనుకోకుండా కుటుంబంలో కలహాలు ఏర్పడే అవకాశం ఉంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడటం మంచిది. మనస్తాపానికి గురవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతనకార్యాలు వాయిదావేసుకోక తప్పదు.

**మకరం**

బంధు, మిత్ర విరోధం ఏర్పడకుండా జాగ్రత్త వహించడం మంచిది. మానసిక ఆందోళన అధికమవుతుంది. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. నూతనకార్యాలకు ప్రణాళికలు వేస్తారు.

**కుంభం**

కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా ఉన్నాయి. వేళ ప్రకారం భుజించడానికి ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు.

**మీనం**

మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.




## సకల ఐశ్వర్య ప్రదాయకం

# ఓం శ్రీం శ్రియై నమః

సువర్ణవృద్ధిం కురు మే గృహే శ్రీః
సుధాన్యవృద్ధిం కురు మే గృహే శ్రీః
కళ్యాణవృద్ధిం కురు మే గృహే శ్రీః
విభూతి వృద్ధిం కురు మే గృహే శ్రీః

ధనం, ధాన్యం, పుత్రులు, మిత్రులు, బంధువులు, వాహనాలు, భృత్యులు, దాసీజనం మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు' అని పూర్వకాలంలో అనేవారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, ప్రశాంతత, ధైర్యం, జ్ఞానం, విద్య, శక్తి మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు'గా గుర్తించాల్సి ఉంది. మొదటివి కనిపించే ఐశ్వర్యాలు కాగా, తర్వాతివి కనిపించకుండా మనలోనే ఉండి మనలను ప్రేరేపించి, మన స్థాయిని పెంచే ఐశ్వర్యాలు. ఇవన్నీ మనలో, మనతోనే ఉండాలంటే మనం వాటికి మూలమైన పాంచభౌతిక శక్తితో కలిసి ఉండాలి. కనిపించే సంపదలన్నీ అనుభవిస్తుంటే అయిపోతుంటాయి. కనిపించని సంపదలు ఎంత అనుభవించినా తరగకుండా ఉంటాయి. సంతోషం, ధైర్యం, ఆరోగ్యం, జ్ఞానం మొదలైన వాటన్నిటికీ లెక్కలు కట్టడం అసాధ్యం. ఇవి తరగని సంపదలు. ఇంకా పెరుగుతూనే ఉంటాయి. వాటిని ఇంకా పెంచుకుంటూ పోవాలి. అవి పెరుగుతుంటేవ్యక్తిలో శక్తి పెరిగి, ఆనందాత్ముడవుతుంటాడు.

మనలోని, మన చుట్టూ వున్న పాంచభౌతిక శక్తికే 'శ్రీం' అని పేరు. ఆ శక్తితో మనం ఎంత ఎక్కువసేపు గడిపితే అంతగా మనలోకి ప్రసరించి, మన మానసిక, భౌతిక శరీరాలను సమన్వయం చేస్తుంది. ఈ లోకంలో మనం శక్తివంతులం అనిపించుకోవాలంటే శరీరానికి, మనసుకు రెండిటికీ శక్తి ఉండాల్సిందే. పార్వతిగా, లక్ష్మిగా, సరస్వతిగా భావించే మూలరూపమైన ఆ 'శ్రీమాత'ను నిరంతరం ఉపాసిస్తే ఈ కనిపించే, కనిపించని సంపదలు, ఐశ్వర్యాలన్నీ మనతోనే ఉంటాయి. పాంచభౌతిక శక్తిలోనే సంపదలన్నీ ఇమిడి ఉంటాయి. అందుకే ఆ శక్తి స్వరూపిణి అయిన శ్రీమాతను 'ఓం శ్రీం శ్రియై నమః' అనే మంత్రంతో ఆరాధిద్దాం. ధన కనక వస్తు వాహన పుత్ర పౌత్రాది దృశ్య సంపదలు అపరిమితంగా మనతో చేరడానికి శక్తి, జ్ఞానం, ధైర్యం, సంతృప్తి మొదలైన అదృశ్య సంపదలు మనతోపాటే ఉండటానికి కనీసం ఒక గంట ఈ జపం చేద్దాం. అవసరాన్నిబట్టి దీక్షతో లక్షల సంఖ్యలో జపిస్తే సర్వ దారిద్ర్యాలు దూరమవుతాయి.

# శ్రీ అరవిందుల తత్త దర్శనం!

సాధన త్రికరణ శుద్ధిగా వుంటే యోగమార్గంలో ఫలితం నూరు శాతం లభిస్తుంది. 1926లో ఇవాల్టి (24 నవంబర్) రోజున రాత్రి 8 గంటల వేళ శ్రీకృష్ణుడు నేరుగా నడిచి వచ్చి శ్రీ అరవిందుని హృదయంలోకి ప్రవేశించాడు. ఆయన తుదిశ్వాస విడిచేవరకు పరమాత్మ అక్కడే నివాసమున్నాడు. ప్రతి సంవత్సరం '24 నవంబరు'ను శ్రీ అరవిందాశ్రమం వారు 'సిద్ధిదినం'గా పాటిస్తారు. నిజానికి ఈ రోజును 'శ్రీకృష్ణారవింద సంయోగ దినం'గా భావించాలి. శ్రీ అరవిందులకు 1908 ప్రాంతంలో విష్ణు భాస్కర లేలే అనే యోగి పుంగవునితో పరిచయమైంది. లేలే మహాశయుడు తనకు హఠయోగం నేర్పాడు. ధ్యానమార్గాన్ని చూపాడు. 'ధ్యానం వేళ ఆలోచనలేవీ పెట్టుకోవద్దు. నీ మెదడును నువు బయటి పదా ర్థం వలె చూస్తూ ఉండు. మెదడులోకి ఆలోచనలు ఒకటొకటిగా వస్తుంటవి. అవి నీ అంతర్నేత్రానికి కనపడుతూ వుంటాయి. వచ్చిన ఆలోచనలను వచ్చినట్టుగా బయటకు పారద్రోలు. తదుపరి నీ మేధ నిశ్చలమవుతుంది' అన్నది ఆ గురువు ఉద్బోధ. శ్రీ అరవిందులు అక్షరాలా దీనిని అమలు జరిపారు. ధ్యానం మొదలుపెట్టిన మూడోరోజే తథాగతుడు ప్రవచించిన నిర్వాణస్థాయికి శ్రీ అరవిందులు చేరుకొన్నారు. అలీపూర్ కుట్రకేసులో విచారణ ఖైదీగా ఆయన కారాగారవాసం అనుభవించారు. అక్కడ వారికేమీ పనిలేదు. విష్ణు భాస్కర లేలే ఉపదేశించిన మార్గంలో పూర్తిస్థాయిలో సాధన చేశారు. గీతాధ్యయనమూ చేశారు. కారాగారంలో ఆయనకు 'శ్రీకృష్ణ దర్శనం' లభించింది. ఆయనకు తోటి ఖైదీలు, పోలీసులు, జైలరు, తనకు అనుకూలంగా–ప్రతికూలంగా కేసును వాదిస్తున్న ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణునివలెనే కనపడసాగారు. తన పక్షాన తాను ఒక్క వాక్యమైనా మాట్లాడలేదు. న్యాయమూర్తి శ్రీ అరవిందుని నిరపరాధిగా విడుదల చేశారు. ఈ అనుభవంతో ఆయన జీవితలక్ష్యమే మారిపోయింది. అరవిందుని కార్యరంగం స్వాతంత్ర్య పోరాటం నుండి ఆధ్యాత్మిక రంగానికి మారింది. 'మన్ను తిన్నాడని' బాలకృష్ణునిపై అభియోగం. 'తినలే'దన్నాడు కన్నయ్య. 'నోరు తెరువు చూస్తా' అన్నది యశోద. ఆ చిన్నినోట్లో పద్నాలుగు భువనాలు ఆమెకు దర్శనమిచ్చాయి. శ్రీ అరవిందులు తన ధ్యానసాధనలో వీటినే దర్శించారు. అక్కడి వాతావరణ పరిస్థితులు, జీవుల స్థితిగతులను అన్నిటినీ



ఆయన ఆంగ్లభాషలో రచించిన 'సావిత్రి' మహాకావ్యంలో మనం చదువవచ్చు. 'మహాభారతం'లోని 'సావిత్రి–సత్యవంతుల' కథ అంతా ఆయనకు దృశ్యకావ్యంలా దర్శనమిచ్చింది. సృష్టి, స్థితి, లయలకు చెందిన సరంజామా మొత్తం వారికి ఆ కథలో గోచరించింది. ఈ భూమిపై నివసించే జీవజాల మంతటికీ ఉత్కృష్ట ప్రాణి మానవుడేనని మనందరి విశ్వాసం. శ్రీ అరవిందుల దృష్టిలో మనం అధమశ్రేణి మానవులం. ఉత్కృష్ట మానవుడింకా ఉద్భవింపవలసే వున్నది. మన దేహంలోని జీవాత్మ.. పరమాత్మ స్వరూపమే అని మనలో కొందరం భావిస్తున్నాం. ఉత్కృష్ట మానవుడు ఈ భావనను నిరంతరమూ అనుభవిస్తుంటాడు. ఈ అనుభవానికి సంబంధించిన అనుభూతికి మినహాయింపులు ఉండవు. భూలోకంలోని మానవులందరూ స్వర్లోక జీవులకువలె తాము పరమాత్మ అంశ అన్న నిరంతర స్పృహతో జీవిస్తుంటారన్న మాట. 'అతిమానస అవతరణం' ద్వారా ఈ ప్రక్రియ సాధ్యమవుతు ందని శ్రీ అరవిందులు చెప్పి వున్నారు. దానికోసం వారు తమ తపస్సు మొత్తాన్ని ధారపోశారు. మనం చేసే ప్రతి పనినీ భగవం తుడు మన ఎదురుగా నిల్చొని చూస్తున్నాడన్న భావనతో చేస్తే చాలు,'అతి మానసఅవతరణం' సాకారమై భువి దివిగా మారిపోతుంది.

# ఈ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై అత్యధిక వడ్డీ..




వివిధ బ్యాంకులు అమలు చేసే ఫిక్స్ డ్ డిపాజిట్ (ఎఫ్ డీ) పథకాలకు ప్రజల ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుంది. కాలానుగుణంగా ఎన్ని పెట్టుబడి మార్గాలు వచ్చినప్పటికీ వీటికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. నిర్ణీత కాలానికి అసలుతో కలిపి వడ్డీ పొందడం, మార్కెట్ రిస్కులతో సంబంధం లేకుండా రాబడి రావడంతో వీటిలో డబ్బులను ఎక్కువ మంది ఇన్వెస్ట్ చేస్తారు. అలాగే సీనియర్ సిటిజన్లు తమ డబ్బులను వీటిలోనే పెట్టుబడి పెడతారు. సాధారణ ఖాతాదారులతో పోల్చితే వీరికి బ్యాంకులు ఎక్కువ వడ్డీని అందిస్తాయి. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్లకు 9.5 శాతం వరకూ వడ్డీని అందిస్తున్న బ్యాంకుల వివరాలు ఇలా ఉన్నాయి.%రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తన రెపోరేటును 25 బేసి పాయింట్లకు తగ్గించింది. అంటే 6.50 శాతం నుంచి 6.25 శాతానికి కుదించింది. దీని వల్ల రుణ గ్రహీతలకు ఈఎంఐ భారం నుంచి మినహాయింపు లభిస్తుంది. కానీ ఎఫ్‌డీలలో పెట్టుబడిదారులకు వడ్డీ తగ్గిపోతుంది. రిజర్వ్ బ్యాంకు నిర్ణయం మేరకు బ్యాంకులు త్వరలో తమ ఎఫ్ డీలపై వడ్డీని తగ్గిస్తాయి. ఈ నేపథ్యంలో ముందుగానే ఫిక్స్ డ్ డిపాజిట్ పథకాలలో డబ్బులు పెట్టడం మంచింది. దీనివల్ల ప్రస్తుతం అమలవుతున్న రేట్లను పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకు ఎఫ్ డీలపై అధిక వడ్డీ ఇస్తున్న బ్యాంకులు ఇవే..

యూనియన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో 1001 రోజుల డిపాజిట్‌కు 9.5 శాతం వడ్డీని లభిస్తుంది.

ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో రెండేళ్ల నుంచి మూడేళ్ల వరకూ డిపాజిట్లకు 9.1 శాతం వడ్డీ అమలవుతోంది.సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో ఐదేళ్ల డిపాజిట్లపై 9.1 వడ్డీ ఇస్తున్నారు.

ఈక్విటాస్ బ్యాంకులో 888 రోజులకు 9 శాతం వడ్డీ అమలవుతుంది.

ఈఎస్ఏఎఫ్ బ్యాంకులో (888 రోజులు) 8.88 శాతం, జన ఫైనాన్స్ లో (ఏడాది నుంచి మూడేళ్లు ) 8.75 శాతం, ఉజ్జీవన్ బ్యాంకులో (12 నెలలు) 8.75 శాతం ఇస్తున్నారు.

బంధన బ్యాంకులో ఫిక్స్ డ్ డిపాజిట్లపై ఏడాదికి 8.55 శాతం వడ్డీని అమలు చేస్తున్నారు.

డీసీబీ బ్యాంకులో 8.55 శాతం వడ్డీని ఇస్తున్నారు.

ఎస్‌బీఎం బ్యాంకులో 18 నెలల నుంచి రెండేళ్ల కంటే తక్కువ రోజులకు ఎఫ్‌డీలపై 8.75 వడ్డీని ఇస్తున్నారు.

సౌత్ ఇండియన్ బ్యాంకులో 18 నెలల డిపాజిట్లపై 7.90 శాతం వడ్డీ ఇస్తున్నారు.

కర్నాటక బ్యాంకులో 375 రోజులకు 8 శాతం వడ్డీ పొందవచ్చు.

ప్రభుత్వ బ్యాంకులు

బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకులలో ఎఫ్ డీ లపై 7.80 శాతం వడ్డీని పొందవచ్చు.

బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రలో 7.95 శాతం వడ్డీని అమలు చేస్తున్నారు.

పంజాబ్, సింధ్ బ్యాంకులలో 7.95 శాతం వడ్డీని పొందవచ్చు.

# వ్యాపారం

## కోటీశ్వరుడు కావడం ఇంత సులభమా..?క్రమశిక్షణ ఉంటే మీకూ సాధ్యమే..!




జీవిత భద్రతకు , భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేయడం చాలా అవసరం. ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం ద్వారా రిటైర్మెంట్ అనంతరం జీవితం సాఫీగా సాగిపోతుంది. పని చేయడానికి శరీరం సహకరించని సమయంలో అండగా ఉంటుంది. అయితే రిటైర్మెంట్ నాటికి ఎంత సొమ్ము పొదుపు చేయాలనేది వారి వారి ఆదాయాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు నెలకు రూ.లక్ష సంపాదించే వ్యక్తి ఒక కోటి రూపాయలను పొదుపు చేయాలంటే ఏమి చేయాలో తెలుసుకుందాం%రిటైర్మెంట్ నాటికి కోటి రూపాయలను పొదుపు చేయాలనుకోవడం చాలా పెద్ద లక్ష్యమే. నెలకు రూ.లక్ష సంపాదించే వ్యక్తి ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి చాలా కష్టబడాలి. అయితే తెలివైన పెట్టుబడి ఎంపిక, క్రమశిక్షణ కలిగిన పొదుపు వ్యూహంతో ఆ కలను సాకారం చేసుకోవచ్చు. కోటి రూపాయల మూలధనాన్ని పొదుపు చేయాలనుకునే లక్ష్యాన్ని సాధించుకోవడానికి ముందుగా ఎక్కడ పొదుపు చేయాలో నిర్ణయించుకోవడం చాలా ముఖ్యం. మ్యూచువల్ ఫండ్స్ లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్లు (ఎస్ఐపీ) కాలక్రమేణా గణనీయమైన సంపదను అందజేస్తాయి. ధీర్ఘకాలంలో అధిక రాబడి పొందడానికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ బాగుంటాయి.కోటి రూపాయల మూలధనం సంపాదించడానికి ప్రతి నెలా ఎంత పొదుపు చేయాలనేది కూడా అత్యంత అవసరం. గణనీయమైన సంపదను పోగు చేయడం కోసం ప్రతి నెలా వచ్చే ఆదాయంలో 15 నుంచి 20 శ్షాతం వరకూ పెట్టుబడి పెడుతూ ఉండాలి. నెలవారీ పెట్టుబడి పెరుగుతుంటే, అనుకున్న లక్ష్యాన్ని చాలా వేగంగా చేరుకోవచ్చు. కాబట్టి నెలకు రూ.లక్ష సంపాదిస్తుంటే సుమారు 15 వేల నుంచి 20 వేలు పెట్టుబడి పెట్టాలి. ఉదాహరణకు ప్రతి నెలా రూ.15 వేలు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ లో పెట్టుబడి పెట్టారనుకుందాం. అది 12 శాతం వార్షిక రాబడిని అందిస్తుంది. మీరు స్థిరమైన రాబడిని పొందుతూ ఉంటే 211 నెలల్లో మీకు రూ.కోటి లభిస్తుంది.

కోటి రూపాయలు సంపాదించే క్రమాన్ని వేగవంతం చేయడానికి స్టెప్‌అప్ సిప్ ను ఎంపిక చేసుకోండి. మీ ఆదాయం పెరిగే కొద్దీ, మీ పెట్టుబడులు కూడా అలాగే పెరగాలి. ఏటా సిప్ మొత్తాన్ని పెంచుకుంటూ పోవడం చాలా అవసరం.

# క్రీడలు

## ఎవరు సామీ నువ్వు అరంగేట్రంలోనే అదరగొట్టావు!
## 46 ఏళ్ళ రికార్డును లేపేసిన లక్నో ఆటగాడు



మాథ్యూ బ్రీట్జ్కే తన వన్డే అరంగేట్రంలోనే 150 పరుగులు చేసి సంచలనం సృష్టించాడు. 46 ఏళ్ల నాటి డెస్మండ్ హేన్స్ రికార్డును అధిగమించి, దక్షిణాఫ్రికా తరపున అరంగేట్ర వన్డేలో సెంచరీ చేసిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. అతని ఈ అద్భుతమైన ప్రదర్శన %ఖూా% 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌లో అతనిపై మరింత ఆసక్తిని పెంచింది. భవిష్యత్తులో బ్రీట్జ్కే మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉంది.దక్షిణాఫ్రికా యువ ఆటగాడు మాథ్యూ బ్రీట్జ్కే తన తొలి వన్డే మ్యాచ్‌లోనే సంచలన ప్రదర్శనతో రికార్డు పుటల్లోకి అడుగుపెట్టాడు. సోమవారం గడ్డాఫీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన ట్రై-సిరీస్ రెండో మ్యాచ్‌లో అతను 148 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 150 పరుగులు చేసి అరుదైన ఘనత సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ దిగ్గజ ఆటగాడు డెస్మండ్ హేన్స్ పేరిట ఉన్న అరంగేట్ర వన్డే అత్యధిక స్కోరు (148) రికార్డును బ్రేక్ చేశాడు. 1978లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో హేన్స్ 148 పరుగులు చేయగా, ఇప్పుడు 46 ఏళ్ల తర్వాత, బ్రీట్జ్కే ఆ రికార్డును అధిగమించాడు.%బూా%20 2025 సీజన్ ముగిసిన వెంటనే, బ్రీట్జ్కే అద్భుతమైన ఫామ్‌ను వన్డే ఫార్మాట్‌లో కూడా కొనసాగించాడు. జాసన్ స్మిత్ (41) తో కలిసి రెండో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 68 బంతుల్లో అర్ధ సెంచరీని పూర్తి చేసిన అతను, తన దృఢమైన ఆటతీరు కొనసాగిస్తూ 128 బంతుల్లో 100 పరుగులు పూర్తి చేశాడు. దక్షిణాఫ్రికా తరపున వన్డే అరంగేట్రంలోనే సెంచరీ చేసిన నాలుగో ఆటగాడిగా బ్రీట్జ్కే రికార్డు నమోదు చేశాడు. గతంలో కాలిన్ ఇంగ్రామ్, ప్రస్తుత కెప్టెన్ టెంబా బావుమా, రీజా హెండ్రిక్స్ మాత్రమే ఈ ఘనత సాధించారు.సెంచరీ అనంతరం, బ్రీట్జ్కే తన దూకుడైన బ్యాటింగ్‌ను కొనసాగించాడు. ఓ'రూర్కే బౌలింగ్‌లో ఒకే ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టి, ప్రోటీస్ స్కోరును వేగంగా పెంచాడు. స్మిత్‌తో మొదట్లో మంచి భాగస్వామ్యం నెలకొల్పిన అతను, తర్వాత వియాన్ ముల్డర్ (64)తో కలిసి నాల్గవ వికెట్‌కు మరో సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దీనితో దక్షిణాఫ్రికా 300 పరుగుల మార్క్‌ను దాటింది.ఇప్పుడు, బ్రీట్జ్కే %ఖూా% 2025లో లక్నో సూపర్ జెయింట్స్ (%బూా+%) తరపున ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. అతని ఈ అద్భుతమైన ప్రదర్శన అతనిపై మరింత ఆసక్తిని పెంచింది. వన్డేలో తన స్థిరత్వం, శక్తివంతమైన షాట్లతో అతను ఒక అత్యుత్తమ టాప్-ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా జట్టుకు మంచి ఆధిపత్యాన్ని అందించిన ఈ యువ క్రికెటర్, భవిష్యత్తులో మరిన్ని కొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉంది.

## 21 శతకాలు, 39 అర్ధశతకాలు, అయినా జట్టులో చోటు లేదు..



21 శతకాలు, 39 అర్ధశతకాలు, అయినా జట్టులో చోటు లేదు.. కట్ చేస్తే.. రిటైర్మెంట్ ఇచ్చిన కేకేఆర్ ప్లేయర్ శెల్డన్ జాక్సన్, భారత దేశవాళీ క్రికెట్‌లో గొప్ప రికార్డు ఉన్నప్పటికీ, ఐపీఎల్‌లో మాత్రం పెద్దగా రాణించలేకపోయాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ (%ఖఖ=%) మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (%=జదీ%) జట్లలో ఉన్నప్పటికీ, అతనికి తక్కువ అవకాశాలు మాత్రమే లభించాయి. 105 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో 7200ం పరుగులు చేసిన జాక్సన్, 21 శతకాలు, 39 అర్ధశతకాలు సాధించాడు. అయితే, ధోనీ, పంత్, సంజు శాంసన్, దినేశ్ కార్తీక్ లాంటి వికెట్ కీపర్లు భారత జట్టులో ఉండటంతో అతనికి పెద్దగా అవకాశాలు రాలేదు. 2024లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు.కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో ఒకప్పుడు ఉన్న శెల్డన్ జాక్సన్ తన 15 ఏళ్ల క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. 38 ఏళ్ల జాక్సన్ మంగళవారం ప్రొఫెషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గుజరాత్‌తో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పరాజయం చెందడంతో అదే అతని చివరి మ్యాచ్‌గా నిలిచింది.

శెల్డన్ జాక్సన్ ఘనమైన ఫస్ట్-క్లాస్ కెరీర్

శెల్డన్ జాక్సన్ ఇప్పటివరకు మొత్తం 105 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 45కు పైగా సగటుతో 7200ం పరుగులు చేశాడు. అందులో అత్యధిక స్కోరు 186. 21 శతకాలు, 39 అర్ధశతకాలు సాధించాడు. జాక్సన్ కేవలం మంచి బ్యాట్స్‌మన్ మాత్రమే కాదు, ఒక నమ్మకమైన వికెట్‌కీపర్, అద్భుతమైన ఫీల్డర్ కూడా. సౌరాష్ట్ర జట్టు కోసం పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో వికెట్ కీపింగ్ చేశాడు. శెల్డన్ జాక్సన్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ, ఐపీఎల్‌లో అంతగా రాణించలేకపోయాడు. 2013లో కోల్‌కతా నైట్ రైడర్స్ ద్వారా ఐపీఎల్‌లోకి ప్రవేశం. కానీ ఆ సీజన్‌లో ఎక్కువ అవకాశాలు రాలేదు. 2017: %ఖఖ=% తరపున కొన్ని మ్యాచ్‌లు ఆడినప్పటికీ, స్థిరమైన స్థానాన్ని దక్కించుకోలేకపోయాడు. ఇక 2021లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో చేరినా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. 2022లో %ఖఖ=% మళ్లీ కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో కొన్ని అవకాశాలు వచ్చినప్పటికీ, పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు.

రంజీ ట్రోఫీలో దూకుడైన ప్రదర్శన

2012-13 రంజీ సీజన్‌లో నాలుగు అర్ధశతకాలు, మూడు శతకాలు సాధించి తన ప్రతిభను చాటాడు. క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్‌లో కర్ణాటక, పంజాబ్‌పై వరుసగా శతకాలు బాదాడు.ఆ సంవత్సరం అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కారణంగా, వెస్టిండీస్ జట్టుతో సిరీస్‌లో ఇండియా %ూ% జట్టులో చోటు సంపాదించాడు. 2015-16 రంజీ ట్రోఫీ సీజన్‌లో సౌరాష్ట్రను ఫైనల్ వరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు.ఎందుకు ఎక్కువ అవకాశాలు రాలేదంటే?భారత జట్టులో ఇప్పటికే అత్యుత్తమ వికెట్‌కీపర్లు (ధోనీ, రిషభ్ పంత్, సంజు శాంసన్, ఉండటంతో అతనికి పెద్ద అవకాశాలు దక్కలేదు. అంతే కాదు ఐపీఎల్‌లో భారీ స్కోర్లు చేయలేకపోవడం అతని కెరీర్‌ను ప్రభావితం చేసింది. 2022 ఐపీఎల్ సీజన్ అనంతరం అతనికి అవకాశాలు రాలేదు. దీంతో 2024లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు.సరైన అవకాశాలు రాక, రిటైర్మెంట్ ప్రకటించిన జాక్సన్

అంతటి గొప్ప ఫస్ట్-క్లాస్ రికార్డు ఉన్నప్పటికీ, అతనికి భారత జాతీయ జట్టులో ఆడే అవకాశం రాలేదు. గత నెలలో పరిమిత ఓవర్ల క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన జాక్సన్, తాజాగా అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు. "భారత జట్టులో ఆడే అవకాశం రాకపోయినా, నా కెరీర్‌పై గర్విస్తున్నాను," అని జాక్సన్ వ్యాఖ్యానించాడు.

# వాల్టా చట్టానికి తూట్లు





తేర్పోల్ లో అక్రమ మట్టి రవాణా.

పట్టపగలు మిట్ట మధ్యాహ్నం తెర్పోల్ లో అక్రమ మట్టి రవాణా.

-రెవెన్యూ అధికారులు అండదండలతో అక్రమ మట్టి తరలింపు.







సమాచారం ఇచ్చిన వాహనాలను పట్టుకోని రెవెన్యూ అధికారులు.

**సత్యమేవ జయతే– కొండాపూర్** మండల పరిధిలోని తెర్పోల్ గ్రామ సర్వేనెంబర్ 104 ప్రభుత్వ భూమి లో నుండి ఎలాంటి రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా మంగళవారం మిట్ట మధ్యాహ్నం రెవెన్యూ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న అక్రమంగా ప్రభుత్వం భూమిలో నుండి గ్రామం వైపు మట్టి తరలిస్తుంటే రెవెన్యూ అధికారులు మాకేం సంబంధం లేదన్నట్టుగా నిర్లక్ష్యంగా ఉన్నారు. వివరాల్లోకెళ్తే తాసిల్దార్ అక్రమంగా మట్టి రవాణా చేసినట్లు సమాచారం ఇస్తే వారిపై తగు చర్యలు తప్పకుండా తీసుకుంటాం అన్న తాసిల్దార్. సమాచారం ఇచ్చిన సంఘటన స్థలంలో నుంచి లొకేషన్ పంపిన దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు దాదాపు 10 నుండి 15 టాక్టర్లు ఒక జెసిబి దాదాపు 50 నుండి 80 వరకు పట్టపగలు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం సంబంధిత తాసిల్దార్ తోపాటు ఆర్ ఐ లకు సమాచారం ఇచ్చిన దొంగలకే దండలు వేసినట్టుగా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వారికి ముందస్తు సమాచారం ఇచ్చి వాహనాలన్నీ క్షేమంగా గ్రామంలోకి తీసుకెళ్లిన తర్వాత వీఆర్ఏ ను తూతూ మంత్రంగా పంపించి అంతా వెతికిన మాకు దొంగలు ఎవరు దొరకలేదు అన్నట్లుగా సమాచారం ఇచ్చారు. అధికారులు అనుకుంటే వాహనాల నెంబర్లతో పట్టుకోవచ్చు మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో అక్రమాలు జరుగుతున్న వారిని పట్టుకోకుండా మేము వెళ్లేసరికి లేరు, పారిపోయారని చేతులెత్తేస్తున్నారు. అధికారులు అనుకుంటే వాహనాలు నెంబర్ల ద్వారా పోలీస్ సహాయంతో ఎంక్వయిరీ అన్ని వాహనాలను తీసుకొచ్చి సిజ్ లేదా జరిమానా వేసే అవకాశం రెవెన్యూ అధికారులకు ఉంటుంది.



సత్యమేవజయతే

ఆకలి చిరునామనే  
బతుకుదెరువుజి  
గాసం కాయమయ్యిందంటే  
మూటెముల్లె సదురు  
పాలుమరిసినాంక  
పాలేరువయితవజి  
కామందు దొరగారికి  
కాల్లొత్తడానికి కాదు  
గుడిసె సందులలోన  
బరిసె పదునింకా సరిసిపెట్టు  
బడుగుల కోసం గుండెలో  
కాసింత జాగను దాసిపెట్టు  
కొలిమిలో నిప్పులకు  
సమాధానం చెప్పు  
ఎగసిపడే రవ్వలకు రోసమింక  
తగ్గిలేనట్లుంది  
అమ్మగట్టిన జోలే  
ఆరుగాలాలు పదిలమే  
ఆయుస్సు ఉంటే ఎదిగి  
ఎదురించు  
నీ విజయ వీరగాథలన్ని  
జగతిలోన జాగారం చేస్తాయ్

## నీలోఫర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**27 వారాల గర్భవతికీ అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాపాయం నుండి కాపాడిన నీలోఫర్ వైద్యులు.**

**డాక్టర్లను అభినందించిన రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ**





**సత్యమేవ జయతే– హైదరాబాద్** అరుదైన శస్త్ర చికిత్స చేసి రోగిప్రాణాన్ని కాపాడిన నిలోఫర్ వైద్యులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. వికారాబాద్ జిల్లాకు చెందిన పేషంట్ వి కవిత(35)కు ఎలెక్టివ్ హిస్టరీ సిజేరియన్ ఆపరేషన్, హిస్టరీ విత్ బ్లాడర్ తో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నిలోఫర్ ఆసుపత్రి యూరాలజిస్ట్ డాక్టర్లు తీవ్రంగా శ్రమించి అరుదైన శస్త్ర చికిత్స ద్వారా హిస్టరీ విత్ బ్లాడర్ ను రిపేర్ చేశారు. ఈ నెల 1వ తేదీన రక్తస్రావంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్ నుండి నీలోఫర్ హాస్పిటల్ కి వైద్యం కోసం వచ్చిన 27 వారాల గర్భవతి అయిన కవితకు ఇన్ బ్రాకెట్స్ జి ఫోర్, ప్లాసెంటా పర్క్రిటా విత్ బ్లాడర్ ఇన్వెన్షన్ అనే అరుదైన ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నారని నీలోఫర్ వైద్యులు గుర్తించి రోగికి ఈ 10వ తేదీన ఎలక్షన్ ఎలెక్టివ్ హిస్టరీ సిజేరియన్ ఆపరేషన్, హిస్టరీ విత్ బ్లాడర్ రిపేర్, మూత్రాశయం మీద ఉన్న అద్దె చీలికలను యూరాలజిస్ట్ వైద్యులు సరి చేశారు. ఈ క్రమంలో ఒక కిలో బరువు ఉన్న మగ శిశువుకు జన్మనిచ్చింది. శిశువుకు ప్రస్తుతం ఎన్ఐసియు విభాగంలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం తల్లి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని నిలోఫర్ వైద్యులు తెలిపారు. ఈ అరుదైన శస్త్ర చికిత్సలో నీలోఫర్ గైనకాలజిస్టు, యూరాలజిస్టులో పాల్గొని విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తి చేసినా డాక్టర్లను, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ గార్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.





## రెండు రోజులుగా ట్రాఫిక్లోనే..! ప్రయోగ రాజ్

**సత్యమేవ జయతే– ఉత్తర ప్రదేశ్** కుంభమేళాలో భక్తుల తాకిడి కొనసాగుతోంది. కోట్లమంది భక్తులు ప్రయాగ రాజ్ కు పోటెత్తుతుండడంతో వందల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది అయితే తాము రెండురోజులుగా ట్రాఫిక్ లోనే ఉన్నట్లు వాపోయారు. ప్రయాగ్ రాజ్ లో త్వరగా ట్రాఫిక్ క్లియర్ అయ్యేలా ఉత్తరప్రదేశ్ సర్కార్ చర్యలు చేపట్టాలని సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ డిమాండ్ చేశారు.